పత్రికతో.. మార్పులు

APTEL/25/A1880

TN తెలుగు న్యూస్

మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..

దిన పత్రిక

సంపుటి : 1 సంచిక : 736 పబ్లిషర్స్ & చీఫ్ ఎడిటర్ : యన్. కృష్ణారావు ఎడిటర్ : ఎస్. మస్తాన్ సోమవారం 5.10.2026 పేజీలు : 8 వెల : 4/-

## జైరాం తొందరపాటుపై
# నిర్మలా సీతారామన్ చురకలు

**జైరాం రమేశ్ పోస్టుపై కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ఆగ్రహం**



- ఏపీ సభలో కనిపించింది ప్రజల ఉత్సాహమేనని స్పష్టీకరణ
- అది ప్రజాగ్రహమంటూ జైరాం రమేశ్ చేసిన వ్యాఖ్యలపై దుమారం
- కాంగ్రెస్ నేతపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ తీవ్ర అభ్యంతరం
- అన్నమయ్య జిల్లా సభ ఘటనపై సోషల్ మీడియాలో మాటల యుద్ధం

2లో



## ఎంపీకే కాదు.. 2లో
# ఏపీకీ 'మామ' ఆయనే

- బుర్రిపాలెంలో 3 లక్షల పీఎంఏవై ఇళ్లకు భూమి పూజ
- రాష్ట్రానికి దశలవారీగా 9 లక్షల ఇళ్లు మంజూరు చేస్తామన్న కేంద్రం
- దేశంలోనే తొలిసారిగా 3D ప్రింటింగ్ టెక్నాలజీతో పేదల ఇళ్ల నిర్మాణం
- వచ్చే మార్చి నాటికి పోలవరం పూర్తి చేసి ప్రధానితో ప్రారంభిస్తామని చంద్రబాబు వెల్లడి
- అమరావతిని క్వాంటం వ్యాలీగా, మెగా సిటీగా అభివృద్ధి చేస్తామని స్పష్టీకరణ



## రష్యాలో భారతీయులకు
# 70 వేల ఉద్యోగాలు!

- నిర్మాణ, లాజిస్టిక్స్ రంగాలకు అధిక ప్రాధాన్యం
- రష్యాతో వాణిజ్యం పెంపునకు భారత్ ప్రయత్నాలు
- చెన్నై-వ్లాదివోస్టాక్ కారిడార్‌పై కీలక చర్చలు
- రష్యా సైన్యంలో చిక్కుకున్న 140 మంది భారతీయుల విడుదల

భారత్, రష్యా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడుతున్నాయి. ఈ ఏడాది సుమారు 70,000 మంది నైపుణ్యం కలిగిన భారతీయ కార్మికులకు తమ దేశంలో ఉపాధి కల్పించేందుకు రష్యా తరువాయి 2లో

## ఆగ్రహం కాదు, ఉత్సాహం
# జైరాం రమేశ్‌కు బాబు, లోకేశ్ కౌంటర్

- మదనపల్లె సభ పై కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ట్వీట్
- ప్రజాగ్రహం అంటూ సోషల్ మీడియాలో వ్యాఖ్యలు
- తీవ్రంగా స్పందించిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్
- అది ప్రజల ఉత్సాహమే తప్ప ఆగ్రహం కాదని చంద్రబాబు వివరణ
- వాస్తవాలు తెలుసుకోకుండా ట్వీట్ చేస్తారా అంటూ లోకేశ్ ఫైర్



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ చేసిన ఓ సోషల్ మీడియా పోస్టుపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. వాస్తవాలు తెలుసుకోకుండా, తప్పుడు సమాచారం ఆధారంగా వ్యాఖ్యలు చేయడం ఏంటని వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అది ప్రజాగ్రహం కాదని, ప్రజల ఉత్సాహం అని స్పష్టం చేస్తూ ఘాటుగా బదులిచ్చారు.

తరువాయి 2లో

## విమానాన్ని
# కూల్చేయాలనుకున్నా

- ఫ్లైదుబాయ్ కోపైలట్ వాంగ్మూలం
- ఫ్లైదుబాయ్ విమానాన్ని కూల్చేయాలన్నది తన ప్లానేనన్న కోపైలట్
- విచారణలో నేరాన్ని అంగీకరించిన హమామ్ అల్-హమామీ
- కెప్టెన్‌ను ఉద్దేశపూర్వకంగానే దారి మళ్లించి దాడి చేశానని వెల్లడి
- హమామ్ సోషల్ మీడియాలో వేలకొద్దీ ఉగ్రవాద పోస్టుల గుర్తింపు
- ఈ కుట్ర వెనుక ఉగ్రసంస్థల హస్తంపై ఇజ్రాయెల్, సౌదీ ఏజెన్సీల దర్యాప్తు

2లో



## రిజర్వేషన్లు వద్దంటే
# పాకీ పనే గతి

- ఆయన వ్యాఖ్యలపై బీజేపీ, పటేల్, బ్రాహ్మణ సంఘాల తీవ్ర ఆగ్రహం
- వాఫీలాకే రూ.5 లక్షలు ఇస్తామంటూ బీజేపీ నేత ప్రతి సవాల్
- త్వరలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు ఊహాగానాలు



2లో





## ఒత్తిడిలో తెలంగాణ యువత..
# దేశంలోనే రెండో స్థానం!

- జుట్టు రాలడానికి మానసిక ఒత్తిడే ప్రధాన కారణమన్న నిపుణులు
- నిద్రలేమి, జీవక్రియ సమస్యలతో తీవ్రమవుతున్న ఆరోగ్య సమస్యలు
- పరిష్కారం కోసం వచ్చేసరికే 55 శాతం మందిలో అడ్వాన్స్‌డ్ స్టేజ్‌లో జుట్టు రాలే సమస్య
- ప్రముఖ హెల్త్ ప్లాట్‌ఫామ్ 'ట్రయా' సర్వేలో వెల్లడి

2లో

## చొరబాటు యత్నాలు
# పాక్ రాయబారికి భారత్ సమన్లు

- పంజాబ్ సరిహద్దుల్లో ఇద్దరు చొరబాటుదారులను కాల్చిచంపిన బీఎస్ఎఫ్
- పాక్ ఆరోపణలను ఖండించిన భారత్.. నార్కోటిక్స్ ముఠాల పనేనని ఆరోపణ
- చనిపోయింది అమాయక పౌరులంటూ భారత దౌత్యవేత్తకు పాక్ నిరసన
- ఘటనపై దర్యాప్తు జరపాలని పరస్పరం డిమాండ్ చేసుకుంటున్న ఇరు దేశాలు



సరిహద్దుల గుండా అక్రమ చొరబాట్లను పాకిస్థాన్ ప్రోత్సహిస్తోందంటూ భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ అంశంపై గట్టి నిరసన తెలిపేందుకు, నిన్న ఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్ తాత్కాలిక దౌత్య అధికారికి సమన్లు జారీ చేసింది. పంజాబ్ సరిహద్దుల్లో జరిగిన ఘటనపై పాకిస్థాన్ చేస్తున్న ఆరోపణలను పూర్తిగా ఖండిస్తున్నట్లు స్పష్టం చేసింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. అక్టోబర్ 2వ తేదీన పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ సెక్టార్ వద్ద అంతర్జాతీయ తరువాయి 2లో

# ఎంపీకే కాదు.. ఏపీకీ 'మామ' ఆయనే: చంద్రబాబు

రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను నెరవేర్చే దిశగా ఎన్డీయే ప్రభుత్వం చారిత్రక ముందడుగు వేసింది. గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెంలో 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ (PMAYG)' కింద మూడు లక్షల ఇళ్ల నిర్మాణ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడిన చంద్రబాబు, 2029 నాటికి రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పక్కా ఇల్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. పేదవాడికి సొంత ఇల్లు అంటే కేవలం నాలుగు గోడలు కాదని, అదొక భద్రత, భవిష్యత్తుకు భరోసా అని ఆయన అభివర్ణించారు.

**కేంద్రం అండ.. 9 లక్షల ఇళ్ల లక్ష్యం**

కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మధ్యప్రదేశ్ కే కాదు "ఆంధ్రప్రదేశ్‌కు కూడా మామ" అని ఆప్యాయంగా సంబోధించిన చంద్రబాబు, ఆయన సహకారంతో రాష్ట్రానికి భారీగా గృహాలు మంజూరయ్యాయని తెలిపారు. తాను అడిగిన వెంటనే 3 లక్షల ఇళ్లను మంజూరు చేశారని, మరో మూడు, నాలుగు నెలల్లో ఇంకో 3 లక్షలు, వచ్చే ఏడాది మరో 3 లక్షల ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారని, మొత్తం 9 లక్షల ఇళ్లను రాష్ట్రానికి అందించనున్నారని వెల్లడించారు. మధ్యప్రదేశ్‌లో నదుల అనుసంధానం వంటి గొప్ప పనులతో శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రజల గుండెల్లో నిలిచారని కొనియాడారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లలో దేశవ్యాప్తంగా 4 కోట్లకు పైగా పక్కా ఇళ్లను నిర్మించిందని గుర్తుచేశారు.

*** దేశంలోనే తొలిసారిగా 3D ప్రింటింగ్ టెక్నాలజీ**

ఈ కార్యక్రమంలో భాగంగా, దేశంలోనే తొలిసారిగా పేదల గృహ నిర్మాణంలో "3D కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీ"ని వినియోగిస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. ప్రయోగాత్మకంగా బుర్రిపాలెంలో 170 ఇళ్లను ఈ నూతన సాంకేతికతతో నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ టెక్నాలజీతో నిర్మించిన ఇళ్లలో బయటి వాతావరణంతో పోలిస్తే లోపల 8 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుందని, తద్వారా ఏసీ అవసరం లేకుండానే చల్లదనం లభిస్తుందని శాస్త్రవేత్తలు చెప్పినట్లు వివరించారు. కేవలం మూడు నెలల్లోనే ఇంటి నిర్మాణం పూర్తికావడం, వర్షాలకు తేమ చేరకపోవడం, లీకేజీలు ఉండకపోవడం వంటి ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఈ పైలట్ ప్రాజెక్ట్



విజయవంతమైతే, రాష్ట్రవ్యాప్తంగా మరో 5,000 ఇళ్లు ఇదే విధానంలో నిర్మించి, బుర్రిపాలెం ఆదర్శాన్ని జాతీయ విధానంగా మార్చేందుకు కృషి చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

**గత ప్రభుత్వ వైఫల్యాలపై విమర్శలు**

గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో విధ్వంసానికి గురైందని చంద్రబాబు ఆరోపించారు. పేదల కోసం గతంలో తమ ప్రభుత్వం మంజూరు చేసిన 17 లక్షల ఇళ్లలో 6 లక్షల ఇళ్లను రద్దు చేశారని, గృహ నిర్మాణంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని విమర్శించారు. చెరువులు, కొండలు, గుట్టల్లో నివాసయోగ్యం కాని స్థలాలను కేటాయించడంతో 4 లక్షల మంది లబ్ధిదారులు వాటిని తిరస్కరించారని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, వివాదాస్పద ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేసి, పట్టాదారు పాసుపుస్తకాలపై గత ముఖ్యమంత్రి ఫొటోను తొలగించి రాజముద్రతో కొత్త పట్టాలు అందిస్తున్నామని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది మార్చి నాటికి భూముల రీసర్వే పూర్తి చేసి, భూ వివాదాలు లేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.

**అభివృద్ధి, సంక్షేమమే అజెండా**

కూటమి ప్రభుత్వానికి 2024 ఎన్నికల్లో ప్రజలు చారిత్రక తీర్పు ఇచ్చారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకునేలా రాత్రింబవళ్లు పనిచేస్తామని చంద్రబాబు అన్నారు. సూపర్ సిక్స్ పథకాలైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, రైతులకు ఏటా రూ. 20,000 ఆర్థిక సాయం వంటివి ఇప్పటికే అమలు చేస్తున్నామని తెలిపారు. వచ్చే మార్చి నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి, ప్రధాని మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని పునరుద్ఘాటించారు. పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా కృష్ణా డెల్టాను ఆదుకున్నామని, ఈ ఏడాది కూడా 60 టీఎంసీల గోదావరి జలాలను తరలించామని వివరించారు.

**అమరావతి.. భవిష్యత్ మెగా సిటీ**

అమరావతి కేవలం రాజధాని కాదని, అదొక మెగా సిటీగా రూపుదిద్దుకుంటుందని చంద్రబాబు పేర్కొన్నారు. విజయవాడ, గుంటూరు, తెనాలి, మంగళగిరి ప్రాంతాలు కలిసిపోయి అంతర్జాతీయ స్థాయి నగరం ఆవిర్భవిస్తుందన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 3న అమరావతిలో "క్వాంటం వ్యాలీ"కి శ్రీకారం చుట్టనున్నట్లు ప్రకటించారు. ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, రాష్ట్ర హౌసింగ్ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఇతర కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# రష్యాలో భారతీయులకు 70 వేల ఉద్యోగాలు!

భారత్, రష్యా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడుతున్నాయి. ఈ ఏడాది సుమారు 70,000 మంది నైపుణ్యం కలిగిన భారతీయ కార్మికులకు తమ దేశంలో ఉపాధి కల్పించేందుకు రష్యా అంగీకరించింది. ముఖ్యంగా నిర్మాణ, లాజిస్టిక్స్ రంగాల్లో ఈ నియామకాలు జరగనున్నాయి. ఈ కీలక విషయాన్ని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్వయంగా వెల్లడించారు. పార్లమెంటరీ సంప్రదింపుల కమిటీ సమావేశంలో ఆయన ఈ వివరాలు తెలిపారు. భారత్‌రష్యా సంబంధాలపై జరిగిన ఈ సమావేశానికి జైశంకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధనం, కనెక్టివిటీ, సాంస్కృతిక, ప్రజల మధ్య సంబంధాలు వంటి పలు అంశాల్లో ఇరు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని వివరించారు. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత సమతుల్యంగా విస్తరించాలని ఇరు దేశాలు లక్ష్యంగా పెట్టుకున్నాయని, ఇందులో భాగంగా ఏడు కీలక రంగాల్లో రష్యాకు భారత ఎగుమతులు పెంచేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఆటోమొబైల్స్, ఫార్మాస్యూటికల్స్, ఆహార ఉత్పత్తులు, సముద్ర ఉత్పత్తులు, ఇంజినీరింగ్ వస్తువులు, రసాయనాలు, టెక్స్‌టైల్స్ రంగాల్లో ఈ అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఇంధన సహకారంపై మాట్లాడుతూ.. బహుళ వనరుల నుంచి ఇంధన సరఫరాలను కొనసాగించడం ద్వారా భారత వినియోగదారుల ప్రయోజనాలను కాపాడటమే తమ ప్రభుత్వ ప్రాధాన్యత అని జైశంకర్ స్పష్టం చేశారు. చెన్నైవ్లాదివోస్టాక్ కారిడార్, అంతర్జాతీయ నార్త్‌సౌత్ ట్రాన్స్‌పోర్ట్ కారిడార్, నార్తర్న్ సీ రూట్ వంటి కనెక్టివిటీ ప్రాజెక్టులపైనా సమావేశంలో చర్చించారు. భారత్‌యురేషియన్ ఎకనామిక్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కుదుర్చుకునే అంశం కూడా ప్రస్తావనకు వచ్చింది. ఇదే సమయంలో ఉక్రెయిన్ సంక్షోభంపై భారత్ దౌత్యపరమైన ప్రయత్నాలను జైశంకర్ కమిటీకి వివరించారు. చర్చలు, శాంతియుత పరిష్కారానికి భారత్ ఎల్లప్పుడూ మద్దతిస్తుందని పునరుద్ఘాటించారు. రష్యా సైన్యంలో సహాయక విధుల పేరుతో చిక్కుకున్న భారతీయ పౌరుల విడుదల కోసం చేస్తున్న ప్రయత్నాలను కూడా ఆయన సభ్యులకు తెలియజేశారు. ఇప్పటివరకు సుమారు 140 మందిని సురక్షితంగా విడిపించామని, మరో 55 మంది ఆచూకీ కోసం రష్యా అధికారులతో చర్చిస్తున్నామని తెలిపారు.

# విమానాన్ని కూల్చేయాలనుకున్నా
# ఫ్లైదుబాయ్ కోపైలట్ వాంగ్మూలం

ఫ్లైదుబాయ్ విమానం హైజాక్ యత్నం కేసులో నిందితుడైన కోపైలట్ హమామ్ అల్ హమామీ విచారణలో సంచలన విషయాలు వెల్లడించాడు. ఉద్దేశపూర్వకంగానే విమానాన్ని కూల్చివేయాలని ప్రయత్నించానని అంగీకరించాడు. చావంటే తనకు ఏమాత్రం భయం లేదని దర్యాప్తు అధికారులతో స్పష్టం చేశాడు. ఇజ్రాయెల్‌కు వెళ్తున్న ఎఫ్ జెడ్ 1073 విమానంలో పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చుర్‌ను ఉద్దేశపూర్వకంగానే దారి మళ్లించి, ఆ తర్వాత తన పథకం ప్రకారం దాడికి పాల్పడినట్లు హమామ్ ఒప్పుకున్నాడు. ప్రార్థన చేసుకుంటానని చెప్పి కెప్టెన్ దృష్టి మరల్చి, విమానంలోని గొడ్డలితో (crash axe) దాడికి యత్నించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. ఈ ఘటనపై ఇజ్రాయెల్, సౌదీ అరేబియా దర్యాప్తు బృందాలు లోతుగా విచారణ జరుపుతున్నాయి. అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలతో గానీ, ఇరాన్‌తో గానీ ఏమైనా సంబంధాలున్నాయా అనే కోణంలో దర్యాప్తు సాగుతోంది. హమామ్ యూఏఈలో జన్మించాడు. అతడి తండ్రి ఒమన్‌కు, తల్లి సిరియాకు చెందినవారు. ఫ్లైదుబాయ్‌లో చేరడానికి ముందు అతను ఒమన్, సిరియా, మొరాకోలలో నివసించాడు. సిరియాలో ఎక్కువ కాలం నివసించినందున, అక్కడి సుదీర్ఘ అంతర్యుద్ధం సమయంలో అతను ఉగ్రవాదం వైపు ఆకర్షితుడై (రాడికలైజ్) ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. అతని సోషల్ మీడియా ఖాతాల్లో వేలకొద్దీ ఉగ్రవాద సంబంధిత పోస్టులు, సందేశాలను అధికారులు గుర్తించారు. అయితే, ఈ కుట్ర వెనుక ఇంకెవరైనా ఉన్నారా అన్న విషయాన్ని మాత్రం అతను ఇంకా వెల్లడించలేదు. కేసులో విచారణ కొనసాగుతోంది.

# రిజర్వేషన్లు వద్దంటే పాకీ పనే గతి

గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ రాజకీయ నేత శంకర్‌సింహ్ వాఘేలా చేసిన వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపాయి. రిజర్వేషన్లను వ్యతిరేకించే అగ్రవర్ణాల వారు మ్యానువల్ స్కావెంజింగ్ (పారిశుద్ధ్య పనులు) చేస్తే నెలకు రూ.50,000 ఇస్తానని ఆయన చేసిన సవాల్ వివాదాస్పదంగా మారింది. నర్మదా జిల్లాలోని సాగ్‌బారాలో అక్టోబర్ 2న జరిగిన ఆదివాసీ రైతుల సమావేశంలో వాఘేలా మాట్లాడారు. ఈ సందర్భంగా రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావిస్తూ.. అది ఎవరూ ఇస్తున్న భిక్ష కాదని, దశాబ్దాలుగా అనుభవించిన వివక్షకు బదులుగా లభించిన హక్కు అని స్పష్టం చేశారు. రిజర్వేషన్లను వ్యతిరేకించే పటేల్, బనియా, బ్రాహ్మణ సామాజిక వర్గాలను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారు. వాఘేలా వ్యాఖ్యలపై బీజేపీ, పాటీదార్, బ్రాహ్మణ సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది.

# జైరాం తొందరపాటుపై నిర్మలా సీతారామన్ చురకలు

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్‌పై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోషల్ మీడియా వేదికగా తీవ్రస్థాయిలో స్పందించారు. "జైరాం, నమ్మలేకపోతున్నాను. మీరింత తొందరపడతారని నేను అనుకోలేదు. అక్కడ ఉన్నది టీడీపీ, జనసేన కార్యకర్తలు. తమ నాయకులైన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లతో మాట్లాడాలని వారు ఉత్సాహం చూపారు. కార్యక్రమం తర్వాత బయటకు వచ్చి మాట్లాడతారని గౌరవ ముఖ్యమంత్రి వారికి చెప్పారు. అక్కడ జరిగింది అంతే" అని ఆమె తన పోస్టులో ఘాటుగా బదులిచ్చారు. ఓ చిన్న విషయాన్ని వక్రీకరించి తప్పుడు ప్రచారం చేయడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు.

**అసలేం జరిగిందంటే..**

ఇటీవల అన్నమయ్య జిల్లా మదనపల్లెలో 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్' నిర్మాణ పనుల ప్రారంభోత్సవ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ప్రసంగిస్తుండగా, సభకు హాజరైన కొందరు యువకులు తమ నాయకులను చూడాలనే ఉత్సాహంతో కేకలు వేశారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కలుగజేసుకుని, కార్యక్రమం ముగిశాక నాయకులు అందరితో మాట్లాడతారని చెప్పి వారిని శాంతపరిచారు.అయితే, ఈ ఘటనకు సంబంధించిన వీడియోను సులేమాన్ ఖాన్ అనే వ్యక్తి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ, 'మొదట ఉద్యోగాలు ఇవ్వండి' అంటూ సభలోని వారు నినాదాలు చేశారని తప్పుడు సమాచారాన్ని జతచేశారు. ఈ పోస్టును జైరాం రమేశ్ రీపోస్ట్ చేస్తూ, "ప్రజల్లో ఎంత ఆగ్రహం ఉందో ఆర్థిక మంత్రి స్వయంగా చూస్తున్నారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని ప్రజలను నిశ్శబ్దంగా మార్చాల్సి వచ్చింది" అని వ్యాఖ్యానించారు. జైరాం రమేశ్ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. వాస్తవాలు తెలుసుకోకుండా, ఎవరో పెట్టిన తప్పుడు పోస్టు ఆధారంగా వ్యాఖ్యలు చేయడం తగదని హితవు పలికారు. సభలో కనిపించింది ప్రజాగ్రహం కాదని, తమ నాయకుల పట్ల ప్రజలు, కార్యకర్తలు చూపిన ఉత్సాహం అని వారు స్పష్టం చేశారు. ఈ ఘటనతో ఏపీలోని ఓ కార్యక్రమం చుట్టూ జాతీయ స్థాయిలో సోషల్ మీడియా వేదికగా రాజకీయ మాటల యుద్ధం రాజుకుంది.

# ఆగ్రహం కాదు, ఉత్సాహం: జైరాం రమేశ్‌కు బాబు, లోకేశ్ కౌంటర్

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ చేసిన ఓ సోషల్ మీడియా పోస్టుపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. వాస్తవాలు తెలుసుకోకుండా, తప్పుడు సమాచారం ఆధారంగా వ్యాఖ్యలు చేయడం ఏంటని వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అది ప్రజాగ్రహం కాదని, ప్రజల ఉత్సాహం అని స్పష్టం చేస్తూ ఘాటుగా బదులిచ్చారు.

**అసలేం జరిగింది?**

ఇటీవల అన్నమయ్య జిల్లా మదనపల్లెలో 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్' పనుల ప్రారంభోత్సవ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతుండగా, సభలో ఉన్న కొందరు యువకులు కేకలు, అరుపులతో కాస్త గందరగోళం సృష్టించారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యం చేసుకుని, వారిని శాంతపరిచి ప్రసంగం సజావుగా సాగేలా చూశారు. అయితే, ఈ ఘటనకు సంబంధించిన వీడియోను సులేమాన్ ఖాన్ అనే నెటిజన్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. 'మొదట ఉద్యోగాలు ఇవ్వండి' అంటూ సభలోని వారు నినాదాలు చేశారని తప్పుడు సమాచారాన్ని జోడించాడు. ఈ పోస్టును జైరాం రమేశ్ రీపోస్ట్ చేస్తూ, "ప్రజల్లో ఎంత ఆగ్రహం ఉందో ఆర్థిక మంత్రి స్వయంగా చూస్తున్నారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని ప్రజలను నిశ్శబ్దంగా మార్చాల్సి వచ్చింది" అని వ్యాఖ్యానించారు.

**చంద్రబాబు, లోకేశ్ తీవ్ర స్పందన**

జైరాం రమేశ్ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. "జైరాం జీ, జరిగిన దానికి మీ వ్యాఖ్యానానికి ఏమాత్రం సంబంధం లేదు. మీరు దేన్నైతే ప్రజాగ్రహం అని తప్పుగా చిత్రీకరించాలని చూస్తున్నారో, అది వాస్తవానికి ప్రజల నుంచి వచ్చిన అపూర్వమైన, ఉత్సాహపూరితమైన స్పందన. సభలో వారి ఉత్సాహం అధికంగా ఉండటంతో, కార్యక్రమం సజావుగా సాగేందుకు నేను జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. ప్రజల ఉత్సాహాన్ని ఆగ్రహంగా పొరబడటం చూస్తుంటే, ఆంధ్రప్రదేశ్ ప్రజల మనోభావాలకు మీరు ఎంత దూరంగా ఉన్నారో అర్థమవుతోంది. రాజకీయ ప్రేరేపిత సోషల్ మీడియా కథనాలతో వాస్తవాలను మార్చలేరు" అని చంద్రబాబు స్పష్టం చేశారు. మంత్రి నారా లోకేశ్ కూడా ఈ వ్యవహారంపై ఘాటుగా స్పందించారు. "ఫేక్ న్యూస్‌ను తయారుచేసేది ఇలాగే. సీనియర్ కాంగ్రెస్ నేతలు వాస్తవాలను కూడా సరిచూసుకోకుండా దాన్ని ప్రచారం చేస్తారు. ఉద్యోగాలు కావాలంటూ ఆర్థిక మంత్రి ప్రసంగానికి స్థానిక యువత అంతరాయం కలిగించారన్నది పూర్తిగా అవాస్తవం. ప్రజలతో సాధారణ సంభాషణను ఉద్దేశపూర్వకంగా కత్తిరించి, వక్రీకరించి కట్టుకథ అల్లుతున్నారు. జైరాం రమేశ్ గారూ, మీలాంటి సీనియర్ నేత ట్వీట్ చేసే ముందు వాస్తవాలు సరిచూసుకోవాలి. ఉద్దేశపూర్వక తప్పుడు సమాచారం తగదు. ఆ అబద్ధాన్ని తొలగించండి" అని లోకేశ్ డిమాండ్ చేశారు.

# చొరబాటు యత్నాలు: పాక్ రాయబారికి భారత్ సమన్లు

సరిహద్దుల గుండా అక్రమ చొరబాట్లను పాకిస్థాన్ ప్రోత్సహిస్తోందంటూ భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ అంశంపై గట్టి నిరసన తెలిపేందుకు, నిన్న ఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్ తాత్కాలిక దౌత్య అధికారికి సమన్లు జారీ చేసింది. పంజాబ్ సరిహద్దుల్లో జరిగిన ఘటనపై పాకిస్థాన్ చేస్తున్న ఆరోపణలను పూర్తిగా ఖండిస్తున్నట్లు స్పష్టం చేసింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. అక్టోబర్ 2వ తేదీన పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ సెక్టార్ వద్ద అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఈ ఘటన చోటుచేసుకుంది. పాకిస్థాన్ వైపు నుంచి ముగ్గురు వ్యక్తులు భారత భూభాగంలోకి అక్రమంగా ప్రవేశించారు. వెనక్కి వెళ్లిపోవాలని సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ వారు పట్టించుకోలేదు. పైగా సరిహద్దు కంచె వైపు దూసుకెళ్తుండటంతో వారిని భద్రతకు ముప్పుగా భావించిన బీఎస్ఎఫ్ బలగాలు కాల్పులు జరపాల్సి వచ్చింది. ఈ కాల్పుల్లో ఇద్దరు వ్యక్తులు మరణించారు. ఈ ఘటనపై పాకిస్థాన్ చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవి, దురుద్దేశంతో కూడినవని భారత్ కొట్టిపారేసింది. పాకిస్థాన్ నుంచి పనిచేస్తున్న సాయుధ నార్కోటిక్స్ సిండికేట్ల కార్యకలాపాల్లో భాగంగానే ఈ చొరబాట్లు జరుగుతున్నాయని ఆరోపించింది. ఇలాంటి కార్యకలాపాలపై, అలాగే దీని వెనుక పాకిస్థాన్ సరిహద్దు దళాల ప్రమేయం ఉందన్న ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరపాలని ఇస్లామాబాద్‌ను భారత్ డిమాండ్ చేసింది. సరిదిద్దుబాటు చర్యలు తీసుకోవాలని, అంతర్జాతీయ సరిహద్దు పవిత్రతను గౌరవించాలని హితవు పలికింది. మరోవైపు, ఈ ఘటనపై పాకిస్థాన్ కూడా తీవ్రంగానే స్పందించింది. ఇస్లామాబాద్‌లోని భారత అగ్రశ్రేణి దౌత్యవేత్తను పిలిపించి నిరసన తెలియజేసింది. బీఎస్ఎఫ్ కాల్పుల్లో మరణించిన ఇద్దరూ నిరాయుధులైన అమాయక పౌరులని ఆరోపించింది. ఈ ఘటనపై తక్షణమే దర్యాప్తు జరపాలని డిమాండ్ చేసింది. ఈ విధంగా ఒకే ఘటనపై ఇరు దేశాలు భిన్న వాదనలు వినిపిస్తూ, దౌత్యపరమైన నిరసనలు తెలుపుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# ఒత్తిడిలో తెలంగాణ యువత.. దేశంలోనే రెండో స్థానం!

తెలంగాణ యువత తీవ్రమైన మానసిక ఒత్తిడి, ఆరోగ్య సమస్యలతో సతమతమవుతోంది. ముఖ్యంగా పురుషుల్లో జుట్టు రాలడానికి దారితీస్తున్న జీవనశైలి సంక్షోభంలో రాష్ట్రం దేశంలోనే రెండో స్థానంలో నిలవడం ఆందోళన కలిగిస్తోంది. ప్రముఖ హెల్త్ ప్లాట్‌ఫామ్ 'ట్రయా' దేశవ్యాప్తంగా 5.6 లక్షల మంది పురుషులపై జరిపిన భారీ అధ్యయనంలో ఈ విస్తుపోయే నిజాలు వెల్లడయ్యాయి.

**సర్వేలో ఏం తేలిందంటే?**

దేశవ్యాప్తంగా 29 నుంచి 31 ఏళ్ల వయసున్న పురుషులు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఈ సర్వే తేల్చింది. జాతీయ స్థాయిలో ఒత్తిడి సగటు 54.6 శాతం ఉండగా, తెలంగాణలో ఇది ఏకంగా 63.6 శాతంగా నమోదైంది. దీంతో దేశంలో అత్యధిక ఒత్తిడి ఎదుర్కొంటున్న రాష్ట్రాల్లో తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. కేవలం ఒత్తిడే కాదు, నిద్రలేమి సమస్యలోనూ మన యువత ముందుంది. జాతీయ సగటు 29.5 శాతం అయితే, తెలంగాణలో 36.7 శాతం మంది యువకులు నిద్రలేమితో బాధపడుతూ దేశంలో రెండో స్థానంలో ఉన్నారు. ఇక జీవక్రియ మందగించడం (మెటబాలిజం) విషయంలో 50.7 శాతంతో మూడో స్థానంలో నిలిచింది. ఈ మూడు సమస్యలు ఒకదానితో ఒకటి ముడిపడి యువత ఆరోగ్యాన్ని, ముఖ్యంగా వారి కేశ సంపదను దెబ్బతీస్తున్నాయి.



# రాగి పాత్ర.. ఆరోగ్యంలో పెద్ద పాత్ర!

**రాగి పాత్రలోని నీటికి ప్రస్తుతం ప్రాధాన్యం పెరుగుతోంది. ఆరోగ్యానికి మేలు చేస్తుందని చాలామంది రాగి పాత్రల్లోనే నీటిని నిల్వ ఉంచి తాగుతుంటారు. రాగి పాత్రలపై సరైన అవగాహన, పద్ధతులు తెలియకపోతే ప్రయోజనాలకు బదులు దుష్ప్రభావాలకు దారితీసే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.**

**లాభాలేంటి?**

రాగి పాత్రలో నీటిని నిల్వ చేసినప్పుడు ఆ నీటిలోకి 'కాపర్' అణువులు కలిసి శరీరంలోని హిమోగ్లోబిన్ ఉత్పత్తికి, ఐరన్ శోషణకు ఎంతగానో దోహదపడుతుంది.

రాగి పాత్రలో నీటిని 6 నుంచి 8 గంటలు ఉంచినప్పుడు నీటి పీహెచ్ స్థాయి స్వల్పంగా మారి సహజ ఆల్కలైన్ నీరుగా మారుతుంది.

రోజు తినే ఆహారపు అలవాట్ల వల్ల కడుపులో యాసిడ్ స్థాయిలు సాధారణంగా పెరుగుతుంటాయి. ఈ రాగి నీటిలోని ఆల్కలైన్ వల్ల ఆ ఆమ్లత్వం స్థిరమై ఎసిడిటీని, గుండెల్లో మంటను తగ్గిస్తుంది.



ఆల్కలైన్ నీరు జీర్ణకోశంలోని ఎంజైములను ప్రేరేపించి తిన్న ఆహారం త్వరగా జీర్ణం అయ్యేలా చేస్తుంది. అంతేకాకుండా ఈ నీటితో శరీరం డీహైడ్రేషన్ నుంచి త్వరగా కోలుకుంటుంది.

సాధారణంగా నీటిలో ఈకొలి, సాల్మోనెల్ల వంటి ప్రమాదకరమైన బ్యాక్టీరియా ఉంటుంది. దీని వల్ల కడుపులో నొప్పి, విరేచనాలు, కలరా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది. రాగి పాత్రలో పోసినప్పుడు ఈ బ్యాక్టీరియా నశించి నీరు శుద్ధి అవుతుంది. పేగుల్లోని బ్యాక్టీరియా మృతి చెంది జీర్ణవ్యవస్థ ఎంతగానో మెరుగుపడుతుంది.

రాగిపాత్రలోని నీటికి శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉంటాయి. ఇవి శరీరంలో విడుదలయ్యే హానికర ఫ్రీ రాడికల్స్‌ని అరికడతాయి. దీంతో చర్మం కాంతిమంతమవుతుంది. తెల్ల రక్తకణాల పనితీరును పెంచి శరీరంలో వచ్చే సీజనల్ వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లను తట్టుకునే శక్తిని ఇస్తాయి.

**చేయకూడని పనులు..**

రాగి పాత్రలోని నీటిని సాధారణ నీళ్లలా రోజంతా తాగకూడదు. శరీరంలో కాపర్ మోతాదు మితిమీరితే కాలేయం, మూత్రపిండాలపై ఒత్తిడి పెరుగుతుంది. రోజుకు ఒకటి లేదా రెండు గ్లాసులు మాత్రమే తాగాలి.

రాగి పాత్రల్లో నిమ్మరసం, మజ్జిగ, పాలు, కాఫీ, టీ వంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ నిల్వ చేయకూడదు. ఇవి రాగితో రసాయన చర్య జరిపి విషపూరితంగా మారే అవకాశం ఉంది.

నీటిలో రాగిలోని మంచి లక్షణాలు కలవడానికి 6 నుంచి 8 గంటల సమయం సరిపోతుంది. అంతకుమించి నిల్వ ఉంచితే కాపర్ మోతాదు ప్రమాదకర స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుంది.

గాలి, నీటి తాకిడికి రాగి పైపొర నల్లగా లేదా ఆకుపచ్చగా మారుతుంది. దీన్ని తోమడానికి సబ్బు వాడకుండా ఉప్పు, నిమ్మకాయ లేదా చింతపండుతో తోమి తడి లేకుండా ఆరబెట్టాలి. వెనిగర్ వేసి కూడా శుభ్రం చేయవచ్చు.

# అరగంట ఇలా నడిస్తే మంచిదట!

సింపుల్‌గా చేసే వ్యాయామాల్లో నడక గురించి మనకు తెలిసిందే! మొదలు పెట్టిన దగ్గర్నుంచి నిర్దేశిత సమయం దాకా ఒకే వేగంతో నడుస్తాం. ఇక బ్రిస్క్ వాకింగ్‌లో భాగంగా కాస్త వేగం పెంచి నడుస్తాం. అయితే ఈ రెండింటి కలయికే 'జపనీస్ వాకింగ్ పద్ధతి'. 30 నిమిషాల సమయం పెట్టుకొని.. మూడు నిమిషాలకోసారి వేగాన్ని మార్చుతూ నడవడమే ఈ వ్యాయామం. అంటే.. తొలుత మూడు నిమిషాల పాటు వేగంగా నడుస్తూ.. ఆ తర్వాతి మూడు నిమిషాలు సాధారణంగా నడుస్తూ వర్కవుట్‌ని కొనసాగించాల్సి ఉంటుంది. 'ఇంటర్వెల్ వాకింగ్ ట్రైనింగ్'గానూ పిలిచే ఈ వాకింగ్ పద్ధతి వల్ల రోజుకు వెయ్యి అడుగులు వేసిన దాని కంటే ఎక్కువ ఫిట్‌నెస్ ప్రయోజనాలు చేకూరతాయంటున్నారు నిపుణులు. జిమ్, జిమ్ పరికరాలతో పని లేకుండా.. సమయం చూసుకోవడానికి ఓ స్టాప్‌వాచ్ లేదంటే మొబైల్ ఉంటే చాలు.. సౌకర్యంగా ఈ వ్యాయామం చేసేయచ్చని చెబుతున్నారు.



**ప్రయోజనాలెన్నో!**

* అరగంట పాటు ఈ జపనీస్ వాకింగ్ పద్ధతిని పాటిస్తే ఆరోగ్యపరంగా, ఫిట్‌నెస్ పరంగా బోలెడన్ని ప్రయోజనాలు చేకూరతాయని నిపుణులు చెబుతున్నారు.
* అరగంట పాటు ఇలా వాకింగ్ చేస్తే జీవక్రియల పనితీరు మెరుగుపడుతుందని చెబుతున్నారు.
* ఈ వాకింగ్ పద్ధతిలో భాగంగా.. మూడు నిమిషాల పాటు వేగంగా నడవడం వల్ల గుండె కొట్టుకునే వేగం పెరుగుతుంది. ఆపై మూడు నిమిషాల పాటు సాధారణంగా నడవడం వల్ల హార్ట్ రేట్ తగ్గుతుంది. ఈ హెచ్చుతగ్గుల వల్ల గుండెకు రక్తప్రసరణ మెరుగుపడి బీపీ అదుపులో ఉంటుందని చెబుతున్నారు నిపుణులు. ఫలితంగా గుండె ఆరోగ్యమూ మెరుగుపడుతుందంటున్నారు.
* జపనీస్ వాకింగ్ పద్ధతి మధుమేహులకూ మేలు చేస్తుందని చెబుతున్నారు నిపుణులు. అంతేకాదు.. ఈ వాకింగ్ పద్ధతిని జీవనశైలిలో భాగం చేసుకోవడం వల్ల టైప్ 2 మధుమేహం వచ్చే రిస్క్ తగ్గుతుందట!
* కాసేపు వేగంగా, మరికాసేపు సాధారణంగా నడవడం వల్ల కాళ్లలోని కండరాలపై ఒత్తిడి పడి అవి దృఢంగా మారే అవకాశం ఉంటుందంటున్నారు.
* అంతేకాదు.. ఈ వ్యాయామం చేయడం వల్ల ఎముక సాంద్రత పెరిగి.. భవిష్యత్తులో ఆస్టియోపొరోసిస్ సమస్య బారిన పడకుండా జాగ్రత్తపడచ్చని నిపుణులు చెబుతున్నారు.
* ఎలాంటి జిమ్ పరికరాలు లేకుండా.. ఒత్తిడికి లోనుకాకుండా చేసే ఈ సింపుల్ వ్యాయామం వల్ల మానసిక ఆందోళనలూ దూరమవుతాయంటున్నారు నిపుణులు. అంతేకాదు.. సుఖ నిద్రకూ ఈ వ్యాయామం ప్రేరేపిస్తుందని చెబుతున్నారు.

## చరిత్రలో ఈ రోజు
### అక్టోబర్ 5




* ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవము
* 1864 : కలకత్తాలో సంభవించిన పెను తుపానులో 60 వేల మందికి పైగా మరణించారు.
* 1929 : భారత లోక్‌సభ సభ్యుడు గుడిసెల వెంకటస్వామి జననం (మ.2014).
* 1932 : భారతదేశం మాజీ క్రికెట్ క్రీడాకారుడు మాధవ్ ఆప్టే జననం (మ.2019)
* 1946 : ప్రముఖ సినిమా నటి రమాప్రభ జననం. (చిత్రంలో)
* 1952 : సామాజిక కార్యకర్త, రచయిత కంచ ఐలయ్య జననం.
* 1975 : ప్రముఖ ఇంగ్లీషు నటి, గాయని కేట్ విన్‌స్లెట్ జననం.
* 1989 : దలైలామాకు నోబెల్ శాంతిబహుమతి వచ్చింది.
* 2001 : ప్రముఖ సంఘసేవకురాలు, ఖాదీ ఉద్యమ నాయకురాలు కల్లూరి తులశమ్మ మరణం (జ.1910).
* 2011 : యాపిల్ ఇన్‌కార్పొరేటేడ్ చైర్మెన్, సీఈఓ స్టీవ్ జాబ్స్ మరణం (జ.1955).


రమాప్రభ



## బొత్స నియోజకవర్గంలో
# వైకాపాకు మరో షాక్

విజయనగరం: వైకాపా నేత బొత్స సత్యనారాయణ సొంత నియోజకవర్గంలో ఆ పార్టీకి మరోసారి భారీ షాక్ తగిలింది. విజయనగరం జిల్లా కుమురం, పోలయ్యవలస, జమ్ము, సదానందపురం, చోడవరం తదితర గ్రామాలకు చెందిన సుమారు 200 కుటుంబాలు వైకాపాను వీడాయి. వందల సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేశారు. కళా వెంకట్రావు ఆధ్వర్యంలో తెదేపాలో చేరుతామని ప్రకటించారు. ఇప్పటికే ఆ పార్టీకి మాజీ జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు గుడ్‌బై చెప్పిన విషయం తెలిసిందే.

## బస్సు ఆపనందుకు..
# కండక్టర్, డ్రైవర్‌పై దాడి

గురజాల: పల్నాడు జిల్లా గురజాలలో మాచర్ల ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌పై దాడి జరిగింది. మాచర్ల వెళ్తున్న బస్సును మాడుగుల అడ్డరోడ్డు వద్ద ఆపాలని ఓ మహిళ కోరింది. అక్కడ కాకుండా ముందుకెళ్లి డ్రైవర్ బస్సు ఆపాడు. అనంతరం మాచర్ల వెళ్లి వస్తున్న బస్సును మహిళ, ఆమె కుటుంబసభ్యులు బైక్‌లతో అడ్డుకున్నారు. డ్యూటీ మారిన కండక్టర్, డ్రైవర్‌పై కోడిగుడ్లతో దాడి చేశారు. కండక్టర్ సోమయ్య ఫిర్యాదు మేరకు గురజాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




## ఆర్థిక సంఘం నిధులు రూ.12వేల కోట్లు రాకుండా వైకాపా కుట్ర: మంత్రి నారాయణ

నెల్లూరు: స్థానిక సంస్థల ఎన్నికలు కచ్చితంగా జరుగుతాయని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ (Narayana) తెలిపారు. ఎన్నికలు జరిగితే రాష్ట్రానికి 16వ ఆర్థిక సంఘం నిధులు రూ.12 వేల కోట్లు మంజూరవుతాయని చెప్పారు. 16వ ఆర్థిక సంఘం నిధులు రాకుండా అడ్డుకునేందుకు.. ఎన్నికలు జరగకుండా వైకాపా ఆటంకాలు సృష్టిస్తోందని మంత్రి విమర్శించారు. నెల్లూరు నగరంలో రూ.2.8 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లపై సుప్రీం కోర్టు తీర్పు రాగానే ఎన్నికలకు వెళతామన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా.. ముఖ్యమంత్రి చంద్రబాబు 123 మున్సిపాలిటీల అభివృద్ధికి ఇప్పటివరకు రూ.50 వేల కోట్లు కేటాయించారని తెలిపారు. నెల్లూరు నగరంలోని తాగునీటి పథకం, అండర్



గ్రౌండ్ డ్రైనేజీ పనులను త్వరలోనే పూర్తి చేస్తామని ప్రకటించారు.

# నందిగామ సీమ చరిత్ర ఎంతో ఘనమైనది

* **మాజీ హోంశాఖ మాత్యులు రచయిత వసంత నాగేశ్వరరావు**





విశాలాంధ్ర నందిగామ: నందిగామ చరిత్ర ఎంతో ఘనమైనదని కళా సాంస్కృతిక సాహిత్య రాజకీయ క్రీడ రంగాల్లో అత్యున్నత స్థాయిలో నిలిచిన ఎందరికో వేదికగా నందిగామ నిలిచిందని అంతరింగ శాఖ మంత్రి, రచయిత వసంత నాగేశ్వరావు అన్నారు ఆదివారం సీనియర్ జర్నలిస్ట్ అన్నవరపు బ్రహ్మయ్య నేతృత్వంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో ఆదివారం నందిగామ లోని ది క్లెవర్ నెస్ట్ స్కూల్ లో ప్రత్యేక సమావేశం జరిగింది ఈ సందర్భంగా నందిగామ కు ఉన్న చరిత్రను గడ్డపై జన్మించి ఎన్నో అవరోధాలు ఎదుర్కొని ఎంతో ఉన్నతమైన స్థాయిలో ఉన్న వారి వివరాలు సేకరించి ప్రజలకు తెలపాలన్న ఉద్దేశంతో ఈకార్యక్రమం మొదలు పట్టినట్లు వారు పేర్కొన్నారు ఈ సందర్భంగా నందిగామ సేమ చరిత్ర ఘనమైనదని వారు అన్నారు కళా సాంస్కృతిక సాహిత్య రాజకీయ క్రీడా రంగాల్లో అత్యున్నత స్థాయిలో నిలిచిన ఎందరికో వేదిక నందిగామ సీమ సుప్రసిద్ధ కవులు కళాకారులు, రచయిత రచయిత్రిలు ఇక్కడివారేనని భారత జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య ఈ ప్రాంత ఆశ్రితులు అని తెలంగాణ సాయుధ పోరాటానికి వెన్నుదన్నుగా నిలిచిన ఉద్యమ గడ్డ నందిగామ అని పేర్కొన్నారు ప్రతి రంగాన చరిత్ర సృష్టించిన ఘనత నందిగామకే దక్కుతుందనీ,ఆధ్యాత్మికంగా ఎంత ప్రసిద్ధి పొందిందో, హేతువాద సామాజిక ఉద్యమాల్లోనూ అంతే గుర్తింపు పొందిందని భారత సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే గబ్బిలం రచయిత పద్మభూషణ్ నడయాడిన నేల ఇదనీ,విశ్వనాథ సత్యనారాయణ రచించిన రామాయణ మహా వృక్షం రచనకు వేదికగా నిలిచిందనీ,తెలుగులో తొలి కథా రచయిత్రి గా కొనియాడ పడుతున్న బండారు అచ్చమాంబ కి జన్మనిచ్చిన నేల నందిగామ అని అన్నారు తొలి తెలుగు ఎన్సైక్లో పీడియాకి శ్రీకారం చుట్టిన కొమర్రాజు లక్ష్మణరావు ఈ ప్రాంతం వారేనని అభ్యుదయ రచయిత్రి వాసిరెడ్డి సీతాదేవి,ప్రజా కవి అద్దేపల్లి రామ్మోహన్ రావు తమ అస్తిత్వాన్ని చాటుకుంది ఇక్కడ నుంచే అని గర్వంగా తెలిపారు. ఎందరో మహానుభావులు వారంతా విద్య వైజ్ఞానిక రంగాల్లో ప్రసిద్ధులుగా ఉన్నారు. వారందరి జీవిత గాధలను సంగ్రహించి ఒక డాక్యుమెంట్ ని చారిత్రక గ్రంథం గా నిలిపేందుకు ప్రయత్నం ప్రారంభమైంది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పూర్వపు అంతరింగ శాఖ మంత్రి,రచయిత వసంత నాగేశ్వరావు హాజరయ్యారు. ఆయా రంగాల్లో ప్రసిద్ధులు రేపాల మోహన్ రావు,కాపా రవీంద్రనాథ్,కొమ్మవరపు విల్సన్ రావు,బబ్బెళ్లపాటి గోపాలకృష్ణ సాయి,చావా రవి, ఘంటా విజయ్ కుమార్ తదితరులు ఈ సమావేశంలో అనేక విషయాలు తెలియజేస్తే,ఈ ప్రాంత చరిత్ర ఇక్కడ వ్యక్తుల విశిష్టత,శాసనాల ద్వారా సంగ్రహించిన సమాచారాన్ని గురించి ప్రఖ్యాత విశ్లేషకులు అభ్యుదయ రచయిత డాక్టర్ లగడపాటి సంగయ్య వివరించారు.ఈ సమావేశం తిరిగి నవంబర్ 1వ తేదీ ఆదివారం నాడు ది క్లెవర్ నెస్ట్ స్కూల్ ప్రాంగణంలో జరుగుతుందనీ పేర్కొన్నారు నందిగామ సమగ్ర చరిత్ర రచనకు సహకరించాలని ఆసక్తి ఉన్నవాళ్లు తమ దగ్గర ఉన్న సమాచారంతో ఈ సమావేశానికి రావాలని విజ్ఞప్తి చేశారు ఈ సమావేశానికి హాజరయ్యే వారు ముందుగా క్రింది ఈ నెంబర్లను 8919823256, 9030159090 లను సంప్రదించాలని కోరారు.

## రూ.2.17 లక్షల పింఛన్ నిధులతో
# ప్రభుత్వ ఉద్యోగి పరారీ

విశాఖ: విశాఖపట్నం జిల్లా మల్కాపురంలో పింఛన్ నిధులతో వెల్ఫేర్ సెక్రెటరీ పరారయ్యాడు. న్యూవార్డు 79 జనతా కాలనీ సచివాలయ కార్యదర్శి దేముడిబాబు డబ్బుతో అదృశ్యమయ్యాడు. లబ్ధిదారులకు పంచాల్సిన రూ.2.17లక్షలతో పరారై ఫోన్ స్విచ్చాఫ్ చేసుకున్నాడు. అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శి నాగరాజు ఫిర్యాదు మేరకు



పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఆ గ్రామంలో రాత్రయితే చాలు హడల్.. ఇళ్ల పై రాళ్ల వర్షం.. అంతుచిక్కని మిస్టరీ!

- **అనంతపురం జిల్లా అప్పాజీపేటలో వింత ఘటన**
- **రాత్రిపూట ఇళ్లపై కురుస్తున్న రాళ్ల వర్షం**
- **పోలీసుల గస్తీ ఉన్నా ఆగని దాడులు**
- **భయంతో ఇళ్లకే పరిమితమవుతున్న గ్రామస్థులు**
- **ఇది అతీత శక్తుల పనేనని కొందరి అనుమానం**



అనంతపురం జిల్లాలోని ఓ గ్రామంలో చీకటి పడితే చాలు, ప్రజలు తీవ్ర భయాందోళనలతో వణికిపోతున్నారు. రాత్రి వేళ ఎక్కడి నుంచి వస్తున్నాయో తెలియని రాళ్లు ఇళ్లపై వర్షంలా కురుస్తుండటంతో, ఏం జరుగుతుందో అర్థంకాక బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఈ వింత ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. వివరాల్లోకి వెళితే.. పామిడి మండలం పరిధిలోని అప్పాజీపేట గ్రామంలో గత వారం రోజులుగా ఈ అంతుచిక్కని ఉదంతం చోటుచేసుకుంటోంది. ప్రతిరోజూ రాత్రి సుమారు 10 గంటల సమయంలో ఇళ్లపై ఎవరో భారీ రాళ్లను విసురుతున్నారు. కొద్ది నిమిషాల వ్యవధిలో దాడులు పునరావృతం అవుతున్నాయి. గ్రామంలో చాలా ఇళ్లు రేకుల షెడ్లు కావడంతో, ఈ రాళ్ల దాడికి అవి దెబ్బతింటున్నాయి. ఈ ఘటనల్లో ఇద్దరు గ్రామస్థులకు స్వల్ప గాయాలయ్యాయి. మొదట ఇది ఆకతాయిల పనేనని భావించిన గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు, గ్రామంలో నలుగురు కానిస్టేబుళ్లతో గస్తీ ఏర్పాటు చేశారు. రెండు రోజుల పాటు పోలీసులు పహారా కాసినా రాళ్ల దాడులు ఆగలేదు. దీంతో, గ్రామ యువకులు సుమారు 20 మంది పోలీసులతో కలిసి సమీపంలోని ఓ గుట్టపైకి ఎక్కి కాపలా కాశారు. అయినా సరే, వారు చూస్తుండగానే ఇళ్లపై రాళ్లు పడటంతో అంతా నివ్వెరపోయారు. పోలీసులు, యువకుల ప్రయత్నాలు విఫలం కావడంతో గ్రామస్థుల్లో భయం రెట్టింపైంది. చీకటి పడగానే ఇళ్లలోకి వెళ్లి తలుపులు వేసుకుంటున్నారు. కొందరు గ్రామస్థులు ఇది దెయ్యాలు లేదా ఇతర అతీత శక్తుల పనేమోనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తాము కంటి మీద కునుకు లేకుండా గడుపుతున్నామని, అధికారులు స్పందించి ఈ మిస్టరీని ఛేదించి తమను కాపాడాలని వేడుకుంటున్నారు. గతంలో తెలుగు రాష్ట్రాల్లోని కొన్ని గ్రామాల్లోనూ ఇలాంటి ఘటనలు నమోదయ్యాయి. 2024లో తమిళనాడులోని తిరుప్పూర్ జిల్లాలో ఓ గ్రామంలో కూడా ఇలాగే ఇళ్లపై రాళ్లు పడిన ఉదంతం సంచలనం సృష్టించింది. ప్రస్తుతానికి అప్పాజీపేటలో ఈ రాళ్ల దాడి మిస్టరీ వీడకపోవడంతో, గ్రామస్థులు భయంతోనే కాలం గడుపుతున్నారు.



## తెగిన ఎస్ఎస్ ట్యాంక్ గట్టు..
# భారీగా తాగునీరు వృథా

ఉరవకొండ: ఉరవకొండ మండలం నింబగల్లు వద్ద ఉన్న గ్రామీణ నీటి సరఫరా (ఆర్డబ్ల్యూఎస్) శాఖకి చెందిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్(ఎస్ఎస్ ట్యాంక్) గట్టు తెగిపోయింది. ఇక్కడ మూడు ట్యాంకులు ఉండగా.. మూడో ట్యాంక్ గట్టు తెగిపోవడంతో తాగునీరు భారీగా వృథా అవుతోంది. గత కొన్నాళ్లుగా గట్టు వెంట నీరు లీకేజీ అవుతున్నా ఆర్డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోకపోవడంతో గట్టుకు భారీ కోత ఏర్పడినట్లు రైతులు వాపోతున్నారు. ఎస్ఎస్ ట్యాంక్ నిండినప్పటికీ తగిన జాగ్రత్తలను తీసుకోకపోవడంతోనే ఈ గట్టు కోతకు గురైనట్లు చెబుతున్నారు. ఆర్డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణ పూర్తిగా లోపించిందని.. పంట నీట మునిగిన బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. ఉరవకొండ పట్టణంతోపాటు మరో ఏడు గ్రామాలకు సాధారణ సమయాలతో పాటు వేసవిలో తాగునీటి సరఫరాకు ఈ ట్యాంకుల్లో నిల్వ ఉండే నీరే ప్రధానం.

# పెమ్మసాని పొలిటికల్ హీరో, నాదెండ్ల బెస్ట్ మినిస్టర్.. చంద్రబాబు ప్రశంసల వర్షం

- **గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్‌పై సీఎం చంద్రబాబు ప్రశంసలు**
- **పెమ్మసానిని పొలిటికల్ హీరోగా అభివర్ణించిన ముఖ్యమంత్రి**
- **ప్రజలతో మమేకమై అద్భుతంగా పనిచేస్తున్నారని కొనియాడిన చంద్రబాబు**
- **ధరల నియంత్రణలో మంత్రి నాదెండ్ల మనోహర్ సమర్థంగా పనిచేస్తున్నారన్న సీఎం**
- **పేదల కోసం పనిచేసే మంత్రులుగా ఇరువురిపై కితాబు**



గుంటూరు జిల్లా బుర్రిపాలెంలో జరిగిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన (PMAY) ఇళ్ల నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ లపై ప్రశంసల వర్షం కురిపించారు. వారి పనితీరును కొనియాడుతూ, కూటమి ప్రభుత్వంలో వారి పాత్రను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "ఒకప్పుడు బుర్రిపాలెం అనగానే సూపర్ స్టార్ కృష్ణ గారు గుర్తొచ్చేవారు. ఇప్పుడు ఇక్కడికి మరో హీరో వచ్చారు. ఆయన సినిమా హీరో అయితే, మన పెమ్మసాని చంద్రశేఖర్ పొలిటికల్ హీరో" అని అభివర్ణించారు. పెమ్మసానిని ఎంపీగా ఎంపిక చేసినప్పుడు తనకు కొన్ని సందేహాలు కలిగాయని చంద్రబాబు బహిరంగంగా అంగీకరించారు. "ఎక్కువకాలం అమెరికాలో ఉన్న పెమ్మసాని, ఇక్కడి ప్రజలతో పట్టు సాధించగలరా? వారితో మమేకం అవుతారా? అని నేను మొదట అనుమానించాను. కానీ ఈరోజు ఆయన ప్రసంగాలు, ప్రజలతో కలిసిపోతున్న తీరు చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది. ఒక సామాన్యుడిలా ప్రజల్లో ఒకరిగా మారిపోయి, అందరి బాగోగులు చూసుకుంటూ బ్రహ్మాండంగా ముందుకు దూసుకెళుతున్నారు" అని చంద్రబాబు కొనియాడారు. పెమ్మసాని ఆధ్వర్యంలో బుర్రిపాలెంలో చేపడుతున్న 3D కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీ ఇళ్ల నిర్మాణాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇది దేశానికే ఆదర్శం కానుందని పేర్కొన్నారు. అదేవిధంగా, జనసేన నాయకుడు, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పనితీరును చంద్రబాబు ఎంతగానో మెచ్చుకున్నారు. "నాకు కేబినెట్‌లో మొదట గుర్తొచ్చేది నాదెండ్ల మనోహర్. నిత్యావసరాల ధరలు కొంచెం పెరిగినా, వెంటనే నాకు ఒక చీటీ పంపించి పరిస్థితిని వివరిస్తారు. ధరలను నియంత్రణలో ఉంచడానికి మేము ఈ చర్యలు తీసుకుంటున్నామని చెబుతారు. పేద ప్రజలపై ధరల భారం పడకుండా అనునిత్యం పనిచేస్తున్న అత్యంత సమర్థవంతమైన మంత్రి మనోహర్" అని ప్రశంసించారు. ఆయన నియోజకవర్గంలో ఈ కార్యక్రమం జరగడంపై సంతోషం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో కీలకమైన శాఖలను నిర్వహిస్తున్న ఈ ఇద్దరు నేతలు ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ముందున్నారని చంద్రబాబు తన ప్రసంగంలో స్పష్టం చేశారు. వారి పనితీరు కూటమి ప్రభుత్వానికి మరింత బలాన్ని చేకూరుస్తోందని ఆయన అన్నారు.

## ఏపీలో 'తల్లికి వందనం'..
# రెండో విడతకు రంగం సిద్ధం

* **సుమారు 3.29 లక్షల మంది తల్లుల ఖాతాల్లో రూ.13,000 జమ**
* **ఇప్పటికే ఆర్థిక శాఖ ఆమోదం.. సీఎంవో అనుమతి కోసం నిరీక్షణ**
* **వచ్చే వారం లేదా రెండు వారాల్లో నిధులు విడుదలయ్యే అవకాశం**




ఆంధ్రప్రదేశ్‌లో 'తల్లికి వందనం' పథకం రెండో విడత నిధుల విడుదలకు మార్గం సుగమమైంది. లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేసేందుకు ఆర్థిక శాఖ ఆమోదం తెలపగా, ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) నుంచి తుది అనుమతి రావడమే మిగిలి ఉంది. సీఎంవో నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన వెంటనే నిధులను విడుదల చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.ఈ విడతలో భాగంగా అర్హులైన సుమారు 3.29 లక్షల మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ. 13,000 చొప్పున ప్రభుత్వం జమ చేయనుంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరిన విద్యార్థులు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు ఈ జాబితాలో ఉన్నారు. వీరితో పాటు, గతంలో సాంకేతిక కారణాలు, ఇతర మార్పుల వల్ల డబ్బులు అందని వారికి కూడా ఈ విడతలో నిధులు అందించనున్నారు. అధికారులు ఇప్పటికే లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేసి తుది జాబితాను సిద్ధం చేశారు. నిధుల విడుదలకు సంబంధించిన ఫైల్‌కు ఆర్థిక శాఖ కూడా ఆమోదముద్ర వేసింది. ప్రస్తుతం ఈ ఫైల్ సీఎంవో వద్ద తుది ఆమోదం కోసం ఉంది. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అనుమతి లభించిన వెంటనే, ఒకటి రెండు వారాల్లో లేదా వచ్చే వారంలోనే నిధులు జమ అయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో, లబ్ధిదారులు తమ బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్ అయ్యిందా లేదా, ఈకేవైసీ పూర్తయిందా అనే వివరాలను సరిచూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. విద్యార్థి, తల్లి ఆధార్ వివరాలు, బ్యాంకు ఖాతా, ఐఎఫ్ఎస్సీ కోడ్ వంటివి సరిగ్గా ఉంటే నిధులు ఎలాంటి ఆటంకాలు లేకుండా సకాలంలో జమ అవుతాయని వారు స్పష్టం చేశారు.

# గృహ నిర్మాణంలో నవ శకం మొదలైంది: డిప్యూటీ సీఎం పవన్

అమరావతి: త్రీడీ కాంక్రీట్ ప్రింటింగ్ సాంకేతికతతో రాష్ట్రంలో గృహ నిర్మాణంలో నూతన శకం మొదలైందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. గుంటూరు జిల్లా బుర్రిపాలెంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ 2.0 కింద 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపనపై పవన్ స్పందించారు. దేశంలోనే తొలిసారిగా త్రీడీ ప్రింటింగ్ ఇళ్లు నిర్మించే కార్యక్రమం ద్వారా గృహ నిర్మాణ రంగంలో వినూత్నమైన ఘట్టానికి తెరలేచిందని అభిప్రాయపడ్డారు. భారతదేశంలోనే మొట్టమొదటి సారిగా త్రీడీ కాంక్రీట్ ప్రింటింగ్ పైలట్ ప్రాజెక్టును ఇక్కడ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. అత్యాధునిక త్రీడీ సాంకేతికతతో బుర్రిపాలెం, ఓబులనాయుడుపాలెం గ్రామాల్లో 177 ఇళ్ల నిర్మాణం చేపట్టడంపై అభినందనలు తెలిపారు. కేవలం 10 రోజుల్లోనే పూర్తిస్థాయి ఇంటి నిర్మాణం, వ్యర్థాలను గణనీయంగా తగ్గించడంతో పాటు నాణ్యత, దృఢత్వం పెరుగుతాయని పవన్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసాన్ని అందించే దిశగా అడుగులు పడుతున్నాయని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి, సాంకేతిక ఆవిష్కరణలకు మద్దతుగా నిలుస్తున్న కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. సాంకేతికత, వేగం, నాణ్యత, సంక్షేమం.. ఈ నాలుగింటినీ అనుసంధానిస్తూ కూటమి ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేస్తోందన్నారు.



# కేబీఆర్ పార్క్ చుట్టూ హెచ్-సిటీ ప్లాన్‌లో భారీ మార్పు.. ఫ్లైఓవర్ల స్థానంలో ఒకే కారిడార్!

- **కేబీఆర్ పార్క్ చుట్టూ మౌలిక సదుపాయాల ప్రణాళికలో మార్పు**
- **బహుళ ఫ్లైఓవర్ల స్థానంలో ఒకే భారీ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం**
- **పంజాగుట్ట ఎన్‌ఎఫ్‌సీఎల్ జంక్షన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు కారిడార్**
- **కొత్త ప్రతిపాదనకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిన జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ**
- **ఐటీ కారిడార్ వైపు సిగ్నల్ ఫ్రీ ప్రయాణం కల్పించడమే లక్ష్యం**

హైదరాబాద్ నగరంలోని కేబీఆర్ నేషనల్ పార్క్ చుట్టూ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలనుకున్న హెచ్‌సిటీ (హైదరాబాద్ క్రియేటివ్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్) ఇన్‌ఫ్రా ప్రాజెక్టులో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కీలక మార్పులు చేసింది. గతంలో ప్రతిపాదించిన పలు ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల స్థానంలో ఒకే భారీ ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించాలని నిర్ణయించింది. పంజాగుట్ట బంజారాహిల్స్ నుంచి జూబ్లీహిల్స్ వైపు రవాణా సౌకర్యాన్ని మరింత సులభతరం చేయడమే లక్ష్యంగా ఈ కొత్త ప్రతిపాదనను ముందుకు తెచ్చింది. ఈ సవరించిన ప్రతిపాదనకు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. మెట్రోపాలిటన్ ఏరియా, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎలివేటెడ్ కారిడార్ కోసం కొత్త డిజైన్లు, వ్యయ అంచనాలను సిద్ధం చేయాలని అధికారులను కమిటీ ఆదేశించింది.

**కొత్త ప్రణాళిక ఇదే..**

తాజా ప్రతిపాదన ప్రకారం, పంజాగుట్ట సమీపంలోని ఎన్‌ఎఫ్‌సీఎల్ జంక్షన్ నుంచి




జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ ప్రాంతం వరకు సుమారు 4 కిలోమీటర్ల పొడవున ఆరు లేన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తారు. దీని ద్వారా జూబ్లీహిల్స్, హైటెక్ సిటీ మాదాపూర్ ఐటీ కారిడార్ వైపు వాహనదారులు ఎలాంటి సిగ్నల్స్ లేకుండా వేగంగా ప్రయాణించేందుకు వీలు కలుగుతుంది.

**ప్రణాళిక మార్పునకు కారణాలు**

కేబీఆర్ పార్క్ చుట్టూ హెచ్‌సిటీ ప్రాజెక్టులో ఇది ఒక ప్రధానమైన మార్పు. గతంలో పార్క్ చుట్టూ ఉన్న కీలక జంక్షన్ల వద్ద జీహెచ్ఎంసీ పలు స్టీల్ ఫ్లైఓవర్లు, డైరెక్షనల్ అండర్‌పాస్‌లను నిర్మించాలని ప్లాన్ చేసింది. ప్యాకేజీ I, II కింద అంచనా వ్యయం మొదట రూ. 826 కోట్లు కాగా, తర్వాత అది రూ. 1,090 కోట్లకు పెరిగింది. అయితే, ఈ ఏడాది ఆగస్టులో కేబీఆర్ పార్క్ చుట్టూ క్లాక్‌వైజ్ వన్‌వే ట్రాఫిక్ విధానాన్ని ప్రవేశపెట్టారు. నిర్మాణ పనుల కోసం తాత్కాలికంగా మొదలుపెట్టిన ఈ విధానం వల్ల ట్రాఫిక్ కదలికలు మెరుగుపడినట్లు అధికారులు గుర్తించారు. దీంతో, తొలుత ప్రతిపాదించిన అన్ని గ్రేడ్ సెపరేటర్లు అవసరమా అనే దానిపై పునరాలోచనలో పడ్డారు. దీనికి తోడు, పాత ప్రాజెక్టుకు పర్యావరణ, న్యాయపరమైన చిక్కులు కూడా ఎదురయ్యాయి. కేబీఆర్ పార్క్ ఎకోసెన్సిటివ్ జోన్ పరిధిలో చెట్ల నరికివేత, తరలింపుపై స్టే రావడంతో పనులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలోనే జీహెచ్ఎంసీ తన ప్రణాళికను సవరించింది. ప్రస్తుతానికి స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపినప్పటికీ, ఇది తుది నిర్మాణ ప్రణాళిక కాదు. దీనికి సంబంధించిన పూర్తిస్థాయి ఇంజనీరింగ్ డిజైన్లు, సవరించిన వ్యయ అంచనాలు ఇంకా సిద్ధం కావాల్సి ఉంది. అనంతరం ఈ ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం కోసం పంపి, ఈపీసీ కమిటీ, జీహెచ్ఎంసీ జనరల్ బాడీ ముందు ఉంచుతారు. ఈ మార్పులతో హైదరాబాద్‌లోని అతిపెద్ద రోడ్డు ఇన్‌ఫ్రా ప్రాజెక్టులలో ఒకటైన హెచ్‌సిటీ స్వరూపం గణనీయంగా మారనుంది.

# శంషాబాద్‌లో ఇండిగో విమానానికి తప్పిన ప్రమాదం

హైదరాబాద్: శంషాబాద్ విమానాశ్రయంలో ఇండిగో విమానానికి ప్రమాదం తప్పింది. పుణె నుంచి వస్తోన్న ఇండిగో విమానాన్ని పక్షి ఢీకొట్టింది. దీంతో ఇండిగో 6ఇ352 విమానం ముందు భాగం స్వల్పంగా దెబ్బతింది. అయితే.. విమానం సురక్షితంగా ల్యాండ్ అయ్యింది. పైలట్ సూచనతో విమానాన్ని




నిపుణుల బృందం తనిఖీ చేసింది. విమానం చండీగఢ్ వెళ్లాల్సి ఉండగా అధికారులు.. ఆ సర్వీసును రద్దు చేశారు.

# తెలంగాణలో కరవు పరిస్థితి చూస్తుంటే బాధగా ఉంది: కవిత

హైదరాబాద్: రాష్ట్రంలో కరవు పరిస్థితి చూస్తుంటే బాధగా ఉందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వరుణయాగం చేసి.. చేతులెత్తేశారని విమర్శించారు. రాష్ట్రంలో ఇప్పటికీ కరవు మండలాలను ప్రకటించలేదన్నారు. కరవు మండలాలను ప్రకటిస్తే.. రైతులకు కేంద్రం సాయం చేస్తుందని చెప్పారు. మీడియా సమావేశంలో కవిత ఈమేరకు మాట్లాడారు. "కృష్ణ జలాలు కుప్పం వరకు తరలిపోయాయి. మన పాలమూరుకు రాని పరిస్థితి. సీఎం రేవంత్‌రెడ్డి.. చంద్రబాబుకు నీళ్లను గిఫ్ట్‌గా ఇస్తున్నారు. హైదరాబాద్ సహా చాలా పట్టణాల్లో నీటి కొరత ఉంది. సాగుకు ఆరేడు గంటలకు మించి విద్యుత్ ఎక్కడా రావడం లేదు. కరెంటు కోతలు నిరూపించేందుకు కొండారెడ్డిపల్లికీ వస్తాను. ప్రభుత్వం రైతులకు



కరెంటు ఇచ్చి తీరాల్సిందే" అని కవిత పేర్కొన్నారు.

# అమెరికాలో రోడ్డు ప్రమాదం.. మహబూబాబాద్ జిల్లా వాసి మృతి



మరిపెడ: అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహబూబాబాద్ జిల్లా వాసి మృతి చెందారు. మరిపెడ మండల కేంద్రానికి చెందిన వివాహిత దారం సుప్రియ(31) అమెరికాలోని మిస్సోరిలో ఉద్యోగ రీత్యా నివాసం ఉంటున్నారు. భారత కాలమానం ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో ఆమె ప్రయాణిస్తున్న కారును వెనుక నుంచి ట్రక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో సుప్రియ అక్కడికక్కడే మృతి చెందగా.. భారత్‌కు చెందిన మరో యువతికి తీవ్ర గాయాలైనట్లు సమాచారం. మృతురాలి భర్త కొదుమూరి రంజిత్, అత్తమామలు కొదుమూరి వెంకటేశ్వర్లు, రాధిక మహబూబాబాద్ పట్టణంలోని వీరభద్ర అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు.

# మేడ్చల్ చెక్‌పోస్టు వద్ద భారీ అగ్ని ప్రమాదం

హైదరాబాద్: మేడ్చల్ చెక్‌పోస్టు వద్ద శనివారం అర్ధరాత్రి భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డు పక్కనున్న రెండు ఫర్నిచర్ దుకాణాల్లో మంటలు ఎగసిపడ్డాయి. పక్కనున్న మరికొన్ని దుకాణాలకూ వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. రెండు దుకాణాల్లో ఫర్నిచర్, ఇతర సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. భారీగా నష్టపోయామని బాధిత దుకాణ యజమానులు విలపించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.



# డ్రైవింగ్ లైసెన్స్ కావాలా?.. ఇక పై ఆ వీడియో కోర్సు తప్పనిసరి!

- **డ్రైవింగ్ లైసెన్స్ స్లాట్ బుకింగ్‌కు తెలంగాణలో కొత్త నిబంధన**
- **ఇకపై రెండున్నర గంటల రోడ్డు భద్రత వీడియో కోర్సు తప్పనిసరి**
- **అభ్యర్థులను గుర్తించేందుకు ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ వినియోగం**
- **పాత, కొత్త ఎల్ఎల్ఆర్ హోల్డర్లందరికీ ఈ నిబంధన వర్తింపు**
- **రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యమన్న రవాణా శాఖ**

డ్రైవింగ్ లైసెన్స్ (డీఎల్) పొందాలనుకునే వారి కోసం తెలంగాణ రవాణా శాఖ కొత్త నిబంధనను అమలులోకి తెచ్చింది. ఇకపై డీఎల్ కోసం స్లాట్ బుక్ చేసుకోవాలంటే, తప్పనిసరిగా రహదారి భద్రతపై రూపొందించిన రెండున్నర గంటల నిడివి గల ప్రత్యేక వీడియో కోర్సును పూర్తి చేయాల్సి ఉంటుంది. గాంధీ జయంతి సందర్భంగా తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలో ఈ నూతన విధానాన్ని ప్రారంభించారు.



రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల పెరుగుదలకు డ్రైవర్లకు రహదారి భద్రతా నియమాలపై సరైన అవగాహన లేకపోవడమే ప్రధాన కారణంగా అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో, విదేశాల్లోని ఉత్తమ విధానాల స్ఫూర్తితో ఈ ఆన్‌లైన్ వీడియో కోర్సును రూపొందించారు. మొత్తం 64 రకాల రహదారి భద్రతా నియమాలు, ప్రాక్టికల్ డ్రైవింగ్ పాఠాలతో ఈ కోర్సును సిద్ధం చేశారు. 25 నిమిషాల చొప్పున ఆరు మాడ్యూళ్లుగా విభజించిన ఈ వీడియోలు తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి. అభ్యర్థులు కేవలం వీడియోను ఆన్ చేసి పక్కన పెట్టకుండా, శ్రద్ధగా వీక్షించేలా రవాణా శాఖ పక్కా ఏర్పాట్లు చేసింది. ఇందుకోసం 'ఫేస్ రికగ్నిషన్' (ముఖ గుర్తింపు) టెక్నాలజీని తప్పనిసరి చేసింది. వీడియో చూస్తున్నంత సేపు దరఖాస్తుదారుడి ముఖం కెమెరాకు స్పష్టంగా కనిపించాలి. అయితే, ఒకేసారి కాకుండా తమకు వీలైనప్పుడు విడతల వారీగా కూడా ఈ కోర్సును పూర్తి చేసే వెసులుబాటును కల్పించారు. మొత్తం కోర్సు పూర్తయ్యాకే డీఎల్ స్లాట్ బుక్ చేసుకోవడానికి సిస్టమ్ అనుమతిస్తుంది. ఈ నిబంధన కేవలం కొత్తగా లెర్నర్ లైసెన్స్ (ఎల్ఎల్ఆర్) తీసుకున్నవారికే కాకుండా, గతంలోనే ఎల్ఎల్ఆర్ పొంది ఇప్పుడు డీఎల్ స్లాట్ బుక్ చేసుకోవాలనుకునే వారికి కూడా వర్తిస్తుందని రవాణా శాఖ సంయుక్త కార్యదర్శి డాక్టర్ వెంకటరమణ స్పష్టం చేశారు. వాహనదారులకు రోడ్డు భద్రతపై పూర్తి అవగాహన కల్పించి, ప్రమాదాలను నివారించడమే ఈ నూతన విధానం ముఖ్య ఉద్దేశమని ఆయన వివరించారు. కూకట్‌పల్లి ఆర్టీవో కార్యాలయంలో చేపట్టిన పైలట్ ప్రాజెక్టు విజయవంతం కావడంతో, తొలి దశగా ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు.

# చార్మినార్ వద్ద "నషా ముక్త్ యువ" వాక్‌థాన్

* **మై భారత్, తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహణ**

యువతలో మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించడంతో పాటు, ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన, మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించాలనే లక్ష్యంతో భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖకు చెందిన మై భారత్, తెలంగాణ, జాతీయ సేవా పథకం సహకారంతో ఆదివారం "నషా ముక్త్ యువ" వాక్‌థాన్ నిర్వహించింది. హైదరాబాద్‌లోని చారిత్రక చార్మినార్ వద్ద ప్రారంభమైన ఈ వాక్‌థాన్ ప్రభుత్వ సిటీ కాలేజ్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమాన్ని రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మై భారత్ రాష్ట్ర డైరెక్టర్ అన్వేష్ చింతల మాట్లాడుతూ.. యువత మాదకద్రవ్యాలకు, అన్ని రకాల మత్తు పదార్థాల దుర్వినియోగానికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని, సానుకూల అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు. ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన, నషా ముక్త్ భారత్ నిర్మాణంలో యువత చురుకుగా భాగస్వాములు



కావాలని పిలుపునిచ్చారు. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అసిస్టెంట్ డైరెక్టర్ విశాల్ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని నిరోధించడంలో యువతలో అవగాహన, సమిష్టి చర్యల ప్రాధాన్యతను వివరించారు. యువత ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్ మాట్లాడుతూ.. నషా ముక్త్ భారత్ నిర్మాణం యొక్క ప్రాధాన్యతను వివరించారు. యువత మాదకద్రవ్యాలు, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యకరమైన, మాదకద్రవ్య రహిత యువతే 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధనకు కీలకమని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం వ్యక్తుల శారీరక, మానసిక ఆరోగ్యంపై మాత్రమే కాకుండా, కుటుంబాలు, సమాజం, దేశంపై కూడా విస్తృత ప్రభావాన్ని చూపుతుందని లక్ష్మణ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మై భారత్ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేష్, ఎన్ఎస్ఎస్ నరసింహ, డీవైఎస్‌వో శ్రీనివాస్, ఆర్. శశాంక్, ఏపీఎస్ ఈ యాదగిరి, ఎం సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి పులి కాదు.. ఊసరవెల్లి

నల్లమల పులి అని చెప్పుకుంటున్న రేవంత్ రెడ్డి పులి కాదు ఊసరవెల్లి అని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. ఊసరవెల్లి రంగులు మారుస్తది రేవంత్ రెడ్డి మాటలు మారుస్తాడు అని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చినంక 100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామంటూ మాటలు చెప్పారు. బాండ్ పేపర్లు రాసిచ్చారు. ఇప్పటికీ వెయ్యి 30 రోజులైంది ఎన్ని గ్యారెంటీలు అమలు చేశారో సమాధానం చెప్పాలి. గ్యారెంటీలకు గోరీలు కట్టిండు, బాండ్ పేపర్లను బొంద పెట్టిండు రేవంత్ రెడ్డి అని మాజీ మంత్రి నిప్పులు చెరిగారు. తెలంగాణ తుర్కకాశ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గజ్వేల్‌లో నిర్వహించిన హక్కుల సాధన కార్యక్రమంలో బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ మాటలు మస్తు చెప్పింది. బడ్జెట్‌లో రూ. 4 వేల కోట్ల కేటాయిస్తాం అన్నారు. మైనారిటీ డిక్లరేషన్ అంటూ అడ్డగోలు హామీలు ఇచ్చారు. ఎన్ని అమలు అయ్యాయో మీకే బాగా తెల్సు. కేసీఆర్ ముఖ్యమంత్రి కాక ముందు మైనారిటీ బడ్జెట్ కేవలం రూ. 300 కోట్లు మాత్రమే. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాతనే బడ్జెట్‌ను పెంచుకుంటూ రూ. 1800 కోట్ల వరకు తీసుకొచ్చారు అని హరీశ్‌రావు గుర్తు చేశారు.

* **మైనారిటీలను చాలా ఘోరంగా మోసం చేసింది**

కేసీఆర్ రూ. 1800 కోట్లు మాత్రమే మైనారిటీలకు




కేటాయిస్తున్నారు. మేము అధికారంలోకి వస్తే రూ. 4000 కోట్లు ఇస్తామంటూ అబద్ధాలు పలికి నేడు రూ. 1300 కోట్లు మాత్రమే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఖర్చు చేస్తుంది. అంటే కేసీఆర్ కంటే రూ. 500 కోట్ల తక్కువనే. తుర్కకాశి, మైనారిటీ ముస్లింలకు కార్పొరేషన్‌లో ఉన్న ఒక్క రూపాయి కూడా లబ్ధి జరగడం లేదు. గడిచిన మూడు సంవత్సరాలలో కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనారిటీలను చాలా ఘోరంగా మోసం చేసింది అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

**కాంగ్రెస్ ఇచ్చింది రూ. 14 కోట్లు మాత్రమే**

బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన విధంగా మైనారిటీలకు కూడా ఓవర్సీస్ స్కాలర్‌షిప్ ఇచ్చి ప్రోత్సహించిన ఘనత కేసీఆర్‌ది. గత పదేండ్ల పాలనలో రూ. 1550 కోట్ల ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌ను మైనారిటీ విద్యార్థులకు అందించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఆ స్కాలర్‌షిప్‌లను ఖతం చేసింది. గడచిన మూడు సంవత్సరాలలో కాంగ్రెస్ ఇచ్చింది రూ. 14 కోట్లు మాత్రమే అని హరీశ్‌రావు తెలిపారు.

* **ఉర్దూ అకాడమీ ఉద్యోగులకు సంవత్సరం నుంచి జీతాలు లేవు**

మైనారిటీ కార్పొరేషన్‌లో ఏడు నెలల నుంచి ఉద్యోగులకు జీతాలు లేవు. ఉర్దూ అకాడమీ ఉద్యోగులకు సంవత్సరం నుంచి జీతాలు లేవు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు షాదిఖానాలను నిర్మించారు. కేసీఆర్ హిందూ, ముస్లిం, సిక్, క్రిస్టియన్ అంటూ తేడా లేకుండా అందరినీ సమానంగా చూశారు అని ఆయన తెలిపారు.

# విరిగిపోయిన రడ్డర్‌తో.. ఆ విమానం ల్యాండవ్వడమే ఓ వండర్..!

ఫ్లైదుబాయ్ విమానం 'FZ1073' ల్యాండ్ కావడం ఏవియేషన్ అద్భుతం. దీనిలోని కోపైలట్ హమామ్ అల్‌హమ్మామీ.. కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై 'క్రాష్ యాక్స్' (అత్యవసర సమయంలో వాడే గొడ్డలి)తో విచక్షణా రహితంగా దాడి చేయడంతో విమానం అసాధారణ స్థాయిలో అదుపు తప్పినట్లు ఫ్లైట్ ట్రాకింగ్ డేటా విశ్లేషణలో తేలింది. ఒక దశలో దాదాపు నిటారుగా విమానం భూమి దిశగా దూసుకొచ్చినట్లు తేలింది. ఆ తర్వాత విమానం తిరిగి అదుపులోకి వచ్చినా.. భౌతికంగా దెబ్బతినడంతో.. ల్యాండింగ్ సవాలుగా మారిందని అమెరికా మీడియా సంస్థ ఓ కథనంలో వెల్లడించింది.

**దాదాపు శబ్ద వేగాన్ని అందుకుని..**

ఫ్లైదుబాయ్ 'FZ1073'.. బోయింగ్ 737మ్యాక్స్ శ్రేణికి చెందిన భారీ విమానం. ఇది అత్యధికంగా మ్యాక్ 0.82 వేగాన్ని మాత్రమే తట్టుకోగలదు. ఇంతకు మించిన వేగంతో ప్రయాణిస్తే విమానం భౌతికంగా దెబ్బతినే ప్రమాదం పొంచి ఉంది. ఈ విమానం దాడి సమయంలో.. 0.96 మ్యాక్ వేగంతో (దాదాపు 1 మ్యాక్ అంటే శబ్ద వేగానికి సమానంగా) భూమి దిశగా రావడం మొదలుపెట్టిందని 'ఫ్లైట్‌రాడార్24' డేటా వెల్లడించింది. ఈ వేగం ఇంకా ఎక్కువే ఉన్నట్లు తెలుస్తోంది. బ్లాక్‌బాక్స్ వివరాలు వస్తే.. కచ్చితమైన వేగం తెలుస్తుంది.

**92 సెకన్లలో 17,000 ఎత్తు తగ్గి..**

విమానం కిందకు పడిపోయే సమయంలో కొన్ని రెట్ల జీఫోర్స్ (గురుత్వాకర్షణ శక్తి)కి లోనైంది. ఫలితంగా విమానం దిశను మార్చుకునేందుకు వినియోగించే రడ్డర్ (rudder) దెబ్బతింది. విమానం ముక్కుభాగం.. సాధారణంగా ల్యాండింగ్ సమయంలో 3 డిగ్రీల కోణంలో కిందకు దిగుతుంది. కానీ, ఫ్లైదుబాయ్ 'FZ1073' మాత్రం అక్టోబర్ 1న 39 డిగ్రీల కోణంలో భూమి దిశగా దూసుకెళ్లింది. కేవలం 92 సెకన్లలో 17,000 అడుగుల కిందకు పడిపోయింది. ఆ సమయంలో విమానం బాడీపై సాధారణ జీఫోర్స్ కంటే మూడు రెట్లు అదనంగా పడింది. సాధారణంగా 737 మ్యాక్స్ రకం విమానం 2.5 పాజిటివ్ జీఫోర్స్ మాత్రమే అత్యధికంగా తట్టుకోగలదు.




ఏ కమర్షియల్ ఫ్లైట్ అయినా ఇంతే. విమానం దిశమార్చుకోవాలంటే అత్యధికంగా 230 నాట్స్ వరకు వేగంలో మాత్రమే సాధ్యం. కానీ, విమానం 0.96 మ్యాక్ వేగంలోకి వెళ్లడంతో దానిని సాధారణ స్థితికి తీసుకురావడం కూడా సవాలే.

**అదుపులోకి వచ్చినా.. డ్యామేజీ తప్పలేదు**

విమానంలో ఉన్న డెడ్‌హెడ్ పైలట్స్ (విధులు ముగించుకొని.. లేదా వేరే చోట్ల విధులకు వెళుతున్నవారు) కంట్రోల్స్‌ను అదుపు చేసినా.. దాని తోక వద్ద రడ్డర్ దెబ్బతింది. వీరు సౌదీలోని తబుక్ విమానాశ్రయంలో అత్యవసర ల్యాండింగ్‌కు వెళుతున్న సమయంలో కూడా.. హఠాత్తుగా 500 అడుగుల ఎత్తు తగ్గిపోవడం వంటి ఘటనలు చోటు చేసుకొన్నాయి. ప్రస్తుతం ఈ విమానం సౌదీలోనే ఉండిపోయింది. ఇక నిపుణులు మాత్రం దీని ఎయిర్ ఫ్రేమ్ సహా అన్ని భాగాలను క్షుణ్ణంగా తనిఖీలు చేసిన తర్వాతే.. మళ్లీ వాడొచ్చా.. లేదా అన్నది నిర్ధరిస్తారు.

## భారతీయ ఫార్మా కంపెనీపై రష్యా దాడి..



ఉక్రెయిన్‌లోని సుమీలో ఉన్న భారతీయ ఫార్మా కంపెనీపై రష్యా దాడి చేసింది. కుసుమ్ అనే కంపెనీపై డ్రోన్ దాడులు జరగడంతో పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. ఈ ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోగా.. పలువురు గాయపడినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. ఫార్మా ప్లాంట్ ప్రధాన నిర్మాణం పూర్తిగా ధ్వంసమైనట్లు తెలుస్తోంది. ఈ దాడుల వల్ల రూ.400 కోట్లు నష్టం వాటిల్లినట్లు కంపెనీ అంచనా వేసింది. కుసుమ్ గ్రూప్ 1994లో భారతీయ మందులను ఉక్రెయిన్‌కు ఎగుమతి చేసే పంపిణీదారుగా ప్రారంభమైంది. 2002లో ఇతర కంపెనీల ఉత్పత్తుల పంపిణీని నిలిపివేసి.. తన సొంత బ్రాండ్‌లను మార్కెటింగ్ చేయడం ప్రారంభించింది. ఆ తర్వాత తయారీ రంగంలోకి ప్రవేశించి.. 2007లో భారత్‌లో, 2009లో ఉక్రెయిన్‌లోని సుమీలో ప్లాంట్లను ప్రారంభించింది. అనంతరం భారత్‌లో మరో రెండు ప్లాంట్లను ఏర్పాటు చేసింది. ఈ గ్రూప్ 50కి పైగా జనరిక్ ఉత్పత్తులను తయారు చేసి, వాటిని ప్రధానంగా ఉక్రెయిన్, ఉజ్బెకిస్థాన్, కజకిస్థాన్, ఫిలిప్పీన్స్‌తో సహా తొమ్మిదికి పైగా దేశాలలో విక్రయిస్తోంది. ప్రస్తుతం దీనిని భారత్‌కు చెందిన రాజీవ్ గుప్తా నడుపుతున్నారు.

## ప్రేయర్ చేసుకుంటానని వెళ్లి.. వెనుక నుంచి గొడ్డలితో నరికాడు: స్మిత్ మచ్చర్

ఫ్లైదుబాయ్ విమానం కాక్‌పిట్‌లో భారత పైలట్ స్మిత్ మచ్చర్‌పై కోపైలట్ దాడి చేసిన ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. ఈ దాడికి సంబంధించి కెప్టెన్ మచ్చర్ కీలక విషయాలు వెల్లడించారు. విమానం నడుపుతున్న సమయంలో కోపైలట్ ప్రార్థన చేసుకుంటానని చెప్పి తన వెనక్కి వెళ్లినట్లు పేర్కొన్నారు. ఈ ప్రాంత పైలట్లు ఇలా ప్రార్థనలు చేసుకోవడం సర్వసాధారణ విషయం కావడంతో తాను అడ్డు చెప్పలేదన్నారు. కొన్ని నిమిషాల వ్యవధిలోనే కాక్‌పిట్‌లో ఉండే గొడ్డలితో తనపై వెనక నుంచి దాడి జరిగినట్లు గుర్తు చేసుకొన్నారు. దీంతో వెంటనే తాను అప్రమత్తమై కాక్‌పిట్ తలుపులు తెరిచినట్లు వెల్లడించారు. కానీ, అతడు తనను అడ్డుకొని తలుపులు తిరిగి మూసివేశాడన్నారు. ఎలాగైనా ప్రయాణికులను కాపాడాలనే ఆలోచనతో బలం కూడదీసుకొని మరోసారి తలుపులు తెరిచి.. సాయం



కోరడంతో ప్రయాణికులు లోపలికి వచ్చి అతడిని బంధించారన్నారు.

**విద్యార్థిగా రెండేళ్లు ఆస్ట్రేలియాలో..**

ఈ దాడిలో నిందితుడిగా భావిస్తున్న ఒమన్‌కు చెందిన హమామ్ అల్‌హమ్మామీగా (29)కు ఉగ్రవాద భావజాలం ఉన్నట్లు ఇప్పటికే అధికారులు పేర్కొన్నారు. ఫ్లైదుబాయ్‌లో చేరడానికి ముందు అతడు ఒమన్, సిరియా, మొరాకోల్లోనే కాకుండా ఆస్ట్రేలియా (Australia)లోనూ రెండేళ్లు ఉన్నట్లు తెలుస్తోంది. 2015లో విద్యార్థి వీసాపై ఆస్ట్రేలియా వెళ్లి..2017వరకు అక్కడే ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఆ సమయంలో అతడు ఎటువంటి కార్యకలాపాల్లో పాల్గొన్నాడనే విషయంపై ఆస్ట్రేలియన్ సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ ఆర్గనైజేషన్ (ASIO) సహా పలు ఏజెన్సీలు దర్యాప్తు చేపట్టాయి.

**హమామ్‌కు అల్‌ఖైదా మద్దతు**

మరోవైపు ఉగ్రవాద సంస్థ అల్‌ఖైదా కోపైలట్ హమామ్ అల్‌హమ్మామీకి మద్దతుగా పలు పోస్టులు చేస్తోంది. 9/11 దాడులను ప్రస్తావిస్తూ అమెరికా, ఇజ్రాయెల్‌లకు చెందిన విమానాల్లో ఇటువంటి దాడులు చేపట్టాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు దాని వారపత్రికలో కథనం ప్రచురించింది. అంతేకాకుండా ట్విన్ టవర్స్‌పై దాడి, ఫ్లైదుబాయ్ విమానానికి సంబంధించిన దృశ్యాలను సైతం దీనిలో ప్రచురించడం గమనార్హం.

## నిరసనల్లో మహిళా జర్నలిస్టులపై పోలీసుల లైంగిక వేధింపులు

కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ.. దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద రెండు రోజులుగా ఆందోళనకారులు నిరసనలు కొనసాగిస్తున్నారు. శనివారం నిరసన జరుగుతున్న సమయంలో పోలీసు సిబ్బంది తమను లైంగికంగా వేధించారని ముగ్గురు మహిళా జర్నలిస్టులు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిరసనకారులను అదుపులోకి తీసుకుంటున్న సమయంలో అక్కడ మహిళా సిబ్బంది ఎవరూ లేకపోవడాన్ని ప్రశ్నించినందుకు ఏసీపీ వివేక్ భగత్ తమను అసభ్యంగా తాకుతూ వెనక్కి నెట్టేశారని ఆరోపించారు. దీంతో వారి ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ కోసం ఈ ఫిర్యాదులను క్రైమ్ బ్రాంచ్ అధికారులకు బదిలీ చేసినట్లు దిల్లీ పోలీసులు వెల్లడించారు.మరోవైపు ఈ నిరసనల్లో ఇప్పటి వరకు వెయ్యి మందికిపైగా నిరసనకారులను అదుపులోకి తీసుకొని, కొన్ని గంటల అనంతరం వదిలేసినట్టు పోలీసులు




వెల్లడించారు. ఆందోళనలపై నిషేధం ఉన్నప్పటికీ సామాజిక సంస్థలు, విద్యార్థి సంఘాల నేతలు జంతర్‌మంతర్ వద్ద గుమిగూడడంతో ఈ చర్యలు తీసుకున్నామన్నారు. ఆదివారం కూడా నిరసనలు కొనసాగే అవకాశం ఉండడంతో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు తెలిపారు. సీఈసీ పదవి నుంచి జ్ఞానేశ్‌కుమార్ వైదొలగకపోతే ఈనెల 10న దిల్లీలో శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వెల్లడించింది. దేశప్రజలంతా ఈ నిరసనలో పాల్గొనాలని పిలుపునిచ్చింది. ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. మహిళా జర్నలిస్టులపై అనుచిత చర్యలకు పాల్పడిన వారిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారని హోంమంత్రి అమిత్‌షాను ప్రశ్నించారు.

## సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై విజిలెన్స్ విచారణ..
## కేరళలో పాత కేసు రీఓపెన్

- **2006లో మలేషియన్ ఇంజనీర్ ఆత్మహత్య కేసులో తిరిగి దర్యాప్తుకు ఉత్తర్వులు**
- **నాటి విచారణపై బాహ్య ఒత్తిళ్లు వచ్చాయన్న ఆరోపణల నేపథ్యంలో తాజా చర్యలు**
- **కాంగ్రెస్ నేత వేసిన పిటిషన్ ఆధారంగా కేరళ హోంమంత్రి ఆదేశాలు**
- **పాత కేసు ఫైళ్లను తెప్పించి సమగ్ర దర్యాప్తు చేపట్టనున్న విజిలెన్స్ బృందం**



ప్రస్తుత భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై తాజాగా విజిలెన్స్ విచారణకు కేరళ ప్రభుత్వం ఆదేశించింది. ఆయన గతంలో కేరళ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (పీడబ్ల్యూడీ) సెక్రటరీగా పనిచేసిన సమయంలో వచ్చిన ఆరోపణలకు సంబంధించి ఈ విచారణ జరగనుంది. కాంగ్రెస్ నేత మలయిన్‌కీళు వేణుగోపాల్ సమర్పించిన పిటిషన్ ఆధారంగా, రాష్ట్ర హోంమంత్రి రమేశ్ చెన్నితాల ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసు 2006 నాటిది. కేరళ రాష్ట్ర రవాణా ప్రాజెక్ట్ (కేఎస్‌టీపీ) కింద ఎంసీ రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగస్వామిగా ఉన్న పాటిబెల్ కన్సార్టియం తరఫున పనిచేసిన మలేషియన్ సివిల్ ఇంజనీర్ లీ సీ బీన్, కేరళ నుంచి తిరిగి వెళ్లాక 2006 నవంబర్‌లో కౌలాలంపూర్‌లో ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన రాశారని చెబుతున్న సూసైడ్ నోట్‌లో అప్పటి పీడబ్ల్యూడీ సెక్రటరీగా ఉన్న జ్ఞానేశ్ కుమార్ పేరు ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. ప్రాజెక్టు పనుల్లో అవకతవకలు జరిగాయని, ఈ కేసులో 2006లో జరిగిన ప్రాథమిక విజిలెన్స్ విచారణ బాహ్య ఒత్తిళ్ల కారణంగా పక్కదారి పట్టిందని వేణుగోపాల్ తన పిటిషన్‌లో ఆరోపించారు. ఈ ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన హోంమంత్రి రమేశ్ చెన్నితాల, నాటి విచారణకు సంబంధించిన ఫైళ్లన్నింటినీ వెంటనే తమకు సమర్పించాలని 'విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ బ్యూరో'ను (వీఏసీబీ) ఆదేశించారు. ఆనాటి దర్యాప్తు ఎలా జరిగిందీ, నిజంగానే ఏవైనా బయటి శక్తులు దానిని ప్రభావితం చేశాయా అనే కోణంలో ఈ ఫైళ్లను పరిశీలించనున్నారు. నాటి విచారణపై వచ్చిన జోక్యం ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరిపి, నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ డైరెక్టర్‌ను హోంమంత్రి ఆదేశించారు. అయితే, సూసైడ్ నోట్‌లో పేరు ప్రస్తావించినంత మాత్రాన లేదా తాజా విచారణకు ఆదేశించినంత మాత్రాన జ్ఞానేశ్ కుమార్ తప్పు చేసినట్లు నిర్ధారణ కాదని స్పష్టమవుతోంది. విజిలెన్స్ దర్యాప్తులో వెల్లడయ్యే వాస్తవాల ఆధారంగా ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకోనుంది. ప్రస్తుతానికి పాత రికార్డులను పరిశీలించి, జోక్యం ఆరోపణలపై దృష్టి సారించడం ఈ విచారణ ప్రధాన ఉద్దేశం.

## ఇళ్ల కొరత, అద్దెల భారం.. స్పెయిన్‌ను కుదిపేస్తున్న గృహ సంక్షోభం!

- **స్పెయిన్‌లో తీవ్రమైన గృహ సంక్షోభంపై భారీ నిరసనలు**
- **రాజధాని మాడ్రిడ్‌తో పాటు 50 నగరాల్లో వేలాది మంది ఆందోళనలు**
- **ప్రభుత్వం ప్రతిపాదించిన గృహ సంక్షోభ నివారణ చర్యలు విఫలం**
- **అద్దెలు తగ్గించాలని, ఇళ్లు ఖాళీ చేయించకుండా రక్షణ కల్పించాలని డిమాండ్**
- **దేశంలో ముందస్తు ఎన్నికలు రావొచ్చనే ఊహాగానాలకు దారితీసిన పరిణామాలు**



స్పెయిన్‌లో గృహ సంక్షోభం తీవ్ర రూపం దాల్చింది. ఇళ్ల కొరత, విపరీతంగా పెరిగిన అద్దెలు, బలవంతపు ఖాళీలపై ప్రజాగ్రహం కట్టలు తెంచుకుంది. రాజధాని మాడ్రిడ్‌తో పాటు దేశంలోని 50 నగరాల్లో శనివారం పదివేల సంఖ్యలో ప్రజలు వీధుల్లోకి వచ్చి భారీ నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ప్రభుత్వం ప్రతిపాదించిన అత్యవసర గృహనిర్మాణ చర్యలను పార్లమెంట్ తిరస్కరించిన మరుసటి రోజే ఈ ఆందోళనలు జరగడం గమనార్హం. మాడ్రిడ్‌లో జరిగిన ప్రదర్శనలో సుమారు 70,000 మంది పాల్గొన్నారని అధికారులు అంచనా వేయగా, ఈ సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుందని నిర్వాహకులు చెబుతున్నారు. అద్దెలు తగ్గించాలని, ఇళ్లు ఖాళీ చేయించకుండా బలమైన చట్టపరమైన రక్షణ కల్పించాలని, ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్‌లు నివాస గృహాలను కొనుగోలు చేయడంపై ఆంక్షలు విధించాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. కొందరు దేశవ్యాప్త సమ్మెకు కూడా పిలుపునిచ్చారు. గత నెలలో జరిగిన ఒక సంఘటన ఈ ఆందోళనలకు మరింత ఆజ్యం పోసింది. దశాబ్దాలుగా ఒకే అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న 87 ఏళ్ల మారికార్మెన్ అబాస్కల్‌ను ఇంటి నుంచి బలవంతంగా ఖాళీ చేయించారు. ఆ భవనాన్ని కొనుగోలు చేసిన ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ అద్దెను భారీగా పెంచడంతో ఆమె చెల్లించలేకపోయారు. ఈ ఉదంతం దేశవ్యాప్తంగా ప్రజల ఆగ్రహానికి ప్రతీకగా నిలిచింది.

ప్రస్తుతం స్పెయిన్‌లో దాదాపు 7 లక్షల ఇళ్ల కొరత ఉన్నట్లు అంచనా. 2025లో సగటున అద్దెలు 8.5% పెరగ్గా, మాడ్రిడ్, బార్సిలోనా వంటి నగరాల్లో ఈ పెరుగుదల ఇంకా ఎక్కువగా ఉంది. దీంతోపాటు ఇళ్ల ధరలు కూడా ఆకాశాన్నంటాయి. ఈ నేపథ్యంలో ప్రధాని పెడ్రో సాంచెజ్ నేతృత్వంలోని మైనారిటీ ప్రభుత్వం రెండు కీలక డిక్రీలను పార్లమెంటులో ప్రవేశపెట్టింది. బలహీన వర్గాల వారిని 2030 వరకు ఇళ్ల నుంచి ఖాళీ చేయించకుండా నిలిపివేయడం, కొన్ని అద్దె ఒప్పందాలను పొడిగించడం వంటి చర్యలు ఇందులో ఉన్నాయి. అయితే, ప్రతిపక్షాలైన పాపులర్ పార్టీ, వోక్స్, జంట్స్ పార్టీలు వ్యతిరేకించడంతో ఈ ప్రతిపాదనలు వీగిపోయాయి. ఈ రాజకీయ పరిణామాలతో స్పెయిన్‌లో ముందస్తు ఎన్నికలు రావొచ్చనే ఊహాగానాలు బలపడ్డాయి.

## ఏపీలో బీపీసీఎల్ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్

దిల్లీ: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రామాయపట్నం పోర్టు సమీపంలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (BPCL) ప్రాజెక్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రూ.96,862 కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు కానుంది. బీపీసీఎల్ రిఫైనరీ ప్రాజెక్టుకు తాజాగా పర్యావరణ అనుమతులు మంజూరయ్యాయి. ఏటా 912 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఈ రిఫైనరీని ఏర్పాటు చేస్తున్నట్టు కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ సహాయమంత్రి అనుప్రియ పటేల్ ఇప్పటికే ప్రకటించారు. రూ.లక్ష కోట్ల పెట్టుబడితో తలపెట్టిన ఈ ప్రాజెక్టును 2030 ఆర్థిక సంవత్సరానికల్లా పూర్తి చేయాలన్నది లక్ష్యం. ఇప్పటికే ఈ ప్రాజెక్టు కోసం 6,000 ఎకరాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేటాయించగా, ముందస్తు కార్యకలాపాలు జరుగుతున్నాయి. దేశీయంగా ఇంధన భద్రత, స్థిరత్వాన్ని సాధించేందుకు ఈ ఒప్పందం




ఉపకరిస్తుందని, ఇంధనం పెట్రో రసాయనాల్లో స్వయం సమృద్ధికి ఉపయోగపడుతుందని బీపీసీఎల్ పేర్కొంది. దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా 1.5 మిలియన్ టన్నుల ఎథిలిన్ క్రాకర్ యూనిట్‌ను ఇక్కడ నెలకొల్పనున్నారు. భారీఎత్తున ఉద్యోగాల కల్పనకు ఈ యూనిట్ ఉపయోగపడనుంది. దీనితో పాటు నుమాలీఘర్ రిఫైనరీ లిమిటెడ్ (ఎన్‌ఆర్‌ఎల్), ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ ట్రావెన్‌కోర్ లిమిటెడ్ (ఫ్యాక్ట్)లతో కూడా ఇతర ప్రాజెక్టుల కోసం బీపీసీఎల్ ఎంఓయూలు చేసుకుంది.




## జీఎస్టీలో మరో సంస్కరణ..
# అధికారులకు 'అరెస్ట్ పవర్' కట్!




ఢిల్లీ: వస్తు, సేవల పన్ను (GST) విషయంలో మరో కీలక సంస్కరణ దిశగా అడుగులు పడుతున్నాయి. జీఎస్టీ అధికారులకు ఉన్న అరెస్ట్ అధికారాలను జీఎస్టీ మండలి రద్దు చేయాలని చూస్తోంది. జీఎస్టీ మోసాలకు సంబంధించి వ్యాపారిని అరెస్ట్ చేయాలంటే కోర్టు నుంచి ముందస్తు అనుమతి తీసుకోవడం తప్పనిసరి కానుంది. అక్టోబర్ 7న జరగనున్న జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకోనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. క్రిమినల్ చర్యలు ప్రారంభించడానికి అవసరమైన మొత్తాన్ని కూడా రూ.1 కోటి నుంచి రూ.5 కోట్లకు పెంచనున్నట్లు సమాచారం. గతేడాది సెప్టెంబర్‌లో చాలా వరకు ఉత్పత్తులపై జీఎస్టీ కౌన్సిల్ పన్ను రేట్లు తగ్గించింది. శ్లాబు రేట్లను సరళతరం చేస్తూ 5, 18, 40 శాతం రేట్లను మాత్రమే పరిమితం చేశారు. ఇప్పుడు మరో దఫా సంస్కరణల్లో భాగంగా నిబంధనలు సరళతరం చేయడంపై దృష్టిసారించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం జీఎస్టీ చట్టంలోని సెక్షన్ 69 ప్రకారం.. పన్ను ఎగవేత, మోసపూరిత ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందడం వంటి రూ.1 కోటికి పైగా మోసం ఇమిడి ఉన్నప్పుడు కమిషనర్ స్థాయి అధికారికి అరెస్ట్ చేసే అధికారం ఉంటోంది. అయితే, అరెస్ట్ అధికారాన్ని జీఎస్టీ అధికారులు వేధింపులకు సాధనంగా వినియోగిస్తున్నారన్న విమర్శలూ ఉన్నాయి. ఇకపై న్యాయస్థానం అనుమతితోనే అరెస్ట్ చేయనున్నారు. అలాగని పన్ను వసూలు, పెనాల్టీలు యథాతథంగా కొనసాగుతాయి. ఉద్దేశపూర్వక పన్ను ఎగవేత లేదా మోస తీవ్రత కలిగిన కేసుల్లో కోర్టుల ద్వారా విచారణ కొనసాగుతుంది.

# ఈఎంఐలు భారం కానున్నాయా? ఆర్‌బీఐ వడ్డీ రేట్లు పెంచే ఛాన్స్




ముంబయి: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) కీలకమైన రెపోరేటును పెంచే అవకాశం ఉంది. అక్టోబర్ నెల ద్రవ్యపరపతి విధాన సమీక్షలో రెపోరేటును 0.25 శాతం మేర పెంచుతూ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని ఆర్థిక విశ్లేషకులు, బ్యాంకర్లు అభిప్రాయపడుతున్నారు. పశ్చిమాసియాలో అనిశ్చిత పరిస్థితుల కారణంగా నెలకొన్న ద్రవ్యోల్బణ భయాలకు తోడు, ఇతర కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లు సవరిస్తుండడమే ఇందుక్కారణమని పేర్కొంటున్నారు. ఒకవేళ విశ్లేషకులు ఊహించినట్లే ఆర్‌బీఐ వడ్డీ రేట్లు సవరిస్తే.. రెపోరేటుతో ముడిపడి ఉన్న గృహ, వాహన రుణాలు ప్రియం కానున్నాయి. ఆ మేర నెలవారీ చెల్లించే ఈఎంఐలు భారం కానున్నాయి. 2023 ఫిబ్రవరిలో చివరిసారిగా ఆర్‌బీఐ వడ్డీ రేట్లను పెంచింది. దీంతో అప్పట్లో రెపోరేటు 6.50 శాతానికి చేరింది. ఆపై 202324లో స్థిరంగా కొనసాగించింది. 2025లో వరుసగా వడ్డీ రేట్లు తగ్గించిన ఆర్‌బీఐ.. పశ్చిమాసియా పరిస్థితుల నేపథ్యంలో స్థిరంగా కొనసాగిస్తోంది. ప్రస్తుతం రెపో రేటు 5.25 శాతంగా ఉంది. అక్టోబర్ నెలకు సంబంధించిన ఎంపీసీ భేటీలో రెపోరేటుపై నిర్ణయం తీసుకోనుంది. బుధవారం నిర్ణయం వెలువడనుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కేంద్ర బ్యాంకులతో సమానంగా ఆర్‌బీఐ కూడా వడ్డీ రేట్లు సవరించవచ్చని పలువురు ఆర్థిక నిపుణులు పేర్కొన్నారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, వృద్ధి ఊపందుకోవడం వంటివి ఇందుకు కారణాలని చెబుతున్నారు. ముఖ్యంగా పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు తలెత్తడం వల్ల ఇంధనం, కమొడిటీ ధరలు పెరుగుతున్నాయని, దీనివల్ల మరోసారి రెపోరేటు పెంచొచ్చని అభిప్రాయపడుతున్నారు. పీటీఐ నిర్వహించిన పోల్‌లో మెజారిటీ ఆర్థిక నిపుణులు ఇదే తరహా అభిప్రాయం వ్యక్తంచేశారు. అయితే, మరోసారి స్టేటస్ కో కొనసాగించే అవకాశమూ లేకపోలేదని మరో ఆర్థికవేత్త అభిప్రాయపడ్డారు. డిమాండ్ ఆధారిత ద్రవ్యోల్బణం ఇంకా ఊపందుకోని కారణంగా మరికొంతకాలం వేచి చూసే ధోరణిని ఆర్‌బీఐ అవలంబించొచ్చని అభిప్రాయం వ్యక్తంచేశారు.

# ధరలు పెరిగినా.. పండగకు డిమాండ్ ఎక్కువే: ఎలక్ట్రానిక్ కంపెనీలు

పండగ సీజన్‌కు ముందు ఏసీ, రిఫ్రిజిరేటర్లు, ఇతర గృహోపకరణాల ధరలను ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీలు 5 నుంచి 7 శాతం పెంచిన విషయం తెలిసిందే. అక్టోబర్ 1 నుంచి ఆయా ధరలు అమల్లోకి వచ్చాయి. ధరలు పెరిగినప్పటికీ.. దసరా, దీపావళి సీజన్‌లో ఉత్పత్తుల విక్రయాల్లో రెండంకెల వృద్ధిని నమోదు చేస్తామని సదరు కంపెనీలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. వినియోగదారులు ప్రీమియం మోడళ్ల కోసం ఈఎంఐ ఆప్షన్లను ఎంచుకోవడం, రీప్లేస్‌మెంట్ వంటి ప్రత్యామ్నాయ ఆప్షన్లు డిమాండ్‌ను పెంచుతాయని విశ్వసిస్తున్నారు. విలువ పరంగా 15 నుంచి 35 శాతం వరకు వృద్ధి నమోదు చేస్తామని ప్రముఖ సంస్థల అధిపతులు వార్త సంస్థ పీటీఐకు తెలిపారు.



- ఏసీ, రిఫ్రిజిరేటర్లు, ఇతర గృహోపకరణాల ధరలు పెరిగినా.. పండగ సీజన్‌లో రెండంకెల వృద్ధిని నమోదు చేస్తామని హైమర్ సంస్థ అధ్యక్షుడు ఎన్ఎస్ సతీష్ అన్నారు. విలువ పరంగా 3035 శాతం వృద్ధిని నమోదు చేస్తామన్నారు. దాదాపు 20 శాతం వరకు అధిక యూనిట్లను విక్రయిస్తామన్నారు.
- పండగ సీజన్‌లో తమ ఉత్పత్తులకు డిమాండ్ అధికంగానే ఉంటుందని ఎల్‌జీ ప్రతినిధి తెలిపారు. కొత్త గృహోపకరణాల కొనుగోలుకు దసరా వేదిక అవుతుందన్నారు. రిఫ్రిజిరేటర్లు, టెలివిజన్ వైపు కాకుండా డిష్‌వాషర్స్, మైక్రోవేవ్స్ తదితర ఉత్పత్తుల కొనుగోలుకు కూడా డిమాండ్ ఎక్కువే ఉంటుందన్నారు.
- ఉత్పత్తుల విలువపరంగా దాదాపు 15 20 శాతం డిమాండ్ ఉంటుందని సోనీ ఇండియా డైరెక్టర్ సునీల్ నయ్యర్ అన్నారు. ప్రీమియం టీవీ మోడళ్లకు కొనుగోలుదారులు మొగ్గుచూపుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.
- ఎయిర్ కండీషనర్స్, రిఫ్రిజిరేటర్ల విక్రయాలకు పండగ సీజన్‌లో అధిక డిమాండ్ ఉంటుందని గ్రోద్రేజ్ అప్లయన్సెస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ కమల్ నంది అన్నారు. ఓనం పండగకు తమ ఉత్పత్తులకు మంచి స్పందన వచ్చిందని, అదే డిమాండ్ దసరా, దీపావళిలోనూ కొనసాగుతుందన్నారు.

# పాత ప్రీమియం కార్లను కొనేద్దాం

హైదరాబాద్: విలాసవంతమైన కారు కొనాలంటే కొత్తదే కావాలన్న భావన క్రమంగా మారుతోంది. ఖరీదైన ప్రీమియం వాహనాలను సొంతం చేసుకోవాలనుకునే యువత.. కొత్త కార్లకు బదులుగా వాడిన (ప్రీఓన్డ్) లగ్జరీ కార్లను ఎంచుకుంటోంది. కొత్త కార్ల ధరలు గణనీయంగా పెరగడం, యువతలో పెరుగుతున్న ఆకాంక్షలు ఇందుకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. ప్రీమియం వాహనాల విభాగంలోకి అడుగుపెట్టేందుకు ప్రీఓన్డ్ కార్లు అనుకూలమైన మార్గంగా మారుతున్నాయి. ప్రస్తుతం ఈ విభాగంలోని కొనుగోలుదారుల సగటు వయసు 3540 ఏళ్ల మధ్య ఉంది. పాత లగ్జరీ కార్ల విపణి గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ప్రథమార్థంలో దాదాపు 21 శాతం పెరిగింది. అదే సమయంలో అమ్ముడైన వాహనాల సగటు ధర (ఏఎస్‌పీ) 25 శాతం పెరిగింది. అధిక విలువ కలిగిన మోడళ్లకూ కొనుగోలుదారుల నుంచి ఆదరణ పెరుగుతోందని మార్కెట్ గణాంకాలు చెబుతున్నాయి.

**రూ.15-30 లక్షల శ్రేణిలో..**

పాత లగ్జరీ కార్ల విపణిలో రూ.15 లక్షల నుంచి రూ.30 లక్షల ధరల శ్రేణి కీలకంగా మారింది. ఈ బడ్జెట్‌లో ప్రీమియం బ్రాండ్లకు చెందిన పెద్ద కార్లు, మెరుగైన ఫీచర్లు ఉన్న మోడళ్లు అందుబాటులోకి రావడం కొనుగోలుదారులను ఆకర్షిస్తోంది. కొత్త లగ్జరీ కారుతో పోలిస్తే తక్కువ ధరకు ప్రీమియం అనుభూతిని పొందే అవకాశం లభిస్తోంది. ఇక సెడాన్లతో పోలిస్తే ఎస్‌యూవీలకు గిరాకీ ఎక్కువగా కనిపిస్తోంది. విశాలమైన స్థలం, మెరుగైన ప్రయాణ అనుభూతి, అధిక గ్రౌండ్ క్లియరెన్స్, రోజువారీ వినియోగానికి అనుకూలత వంటి అంశాలూ వీటి ఆదరణకు కారణమవుతున్నాయి. పెట్రోల్ వాహనాలతో పోలిస్తే డీజిల్ మోడళ్లకూ కొనుగోలుదారుల నుంచి ఆసక్తి కనిపిస్తోంది.

# సోషల్ మీడియా కోసమే: వైభవ్‌కు సైమ్ సైగలపై పాక్ మాజీ విమర్శలు

ఆసియా క్రీడల్లో భారత పురుషుల క్రికెట్ జట్టు స్వర్ణం నెగ్గింది. వరుసగా రెండో ఎడిషన్‌లోనూ గోల్డ్ మెడల్‌ను కొట్టేసింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను ఓడించి మరీ ఈ విజయం సాధించడం గమనార్హం. ఆసియా క్రీడల్లో పతకం అందుకొన్న అతి పిన్న వయస్కుడిగా వైభవ్ సూర్యవంశీ రికార్డు సృష్టించాడు. క్రికెట్ దిగ్గజాలే వైభవ్‌పై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఇలాంటి కుర్రాడిని అవమానించేలా పాకిస్థాన్ ఆటగాడు సైమ్ అయూబ్ చేసిన సైగలు నెట్టింట వైరల్‌గా మారాయి. దీంతో సైమ్‌పై సోషల్ మీడియాలో తీవ్ర స్థాయిలో ట్రోలింగ్ మొదలైంది. పాకిస్థాన్ మాజీ ఆటగాడు కమ్రాన్ అక్మల్ కూడా సైమ్ చర్యలను తీవ్రంగా ఖండించాడు. "మా ఆటగాళ్ల ప్రదర్శన మాత్రం గొప్పగా ఉండదు. కానీ, ఇలాంటి పనికిమాలిన చర్యలు మాత్రం చాన్నాళ్ల నుంచి జరుగుతూనే ఉన్నాయి. ఇవన్నీ మేం కేవలం సోషల్ మీడియా కోసమే చేస్తాం అన్నట్లుగా ఉంది. దీని గురించి మేనేజ్‌మెంట్ ఆలోచించాలి. ఇది



అంతర్జాతీయ క్రికెట్. ప్రత్యర్థి ఆటగాడి వయసు 14 లేదా 15 ఏళ్లు అనేది తర్వాత సంగతి. అతడు ఇంటర్నేషనల్ క్రికెట్ ఆడుతున్నాడు. సైమ్ ఏమీ పిల్లాడు కాదు. అతడు తన ప్రదర్శన మీద దృష్టి పెడితేనే బాగుంటుంది'' అని కమ్రాన్ వ్యాఖ్యానించాడు.

**అసలేం జరిగిందంటే?**

పాకిస్థాన్‌తో ఫైనల్‌లో భారత్ తొలుత బ్యాటింగ్ చేసింది. మూడో ఓవర్‌ను సైమ్ అయూబ్ వేశాడు. రివర్స్ స్వీప్‌తో బంతిని ఆడేందుకు ప్రయత్నించిన వైభవ్ సూర్యవంశీ వికెట్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చాడు. దీంతో 15 పరుగుల వద్ద వైభవ్ పెవిలియన్ బాట పట్టాడు. అతడు వెళ్లే క్రమంలో సైమ్ 'చిన్న పిల్లాడివి' అన్నట్లుగా సైగలు చేశాడు. వైభవ్ మాత్రం పట్టించుకోకుండా డగౌట్‌కు వెళ్లిపోయాడు.

**ఇలాంటివి అవసరమా?**

పాకిస్థాన్ క్రికెట్ ఆటతీరు ఇటీవల కాలంలో తీవ్ర విమర్శలకు దారితీసింది. ఇప్పుడు భారత్‌తో మ్యాచ్‌లోనూ ఆ జట్టు ఓడింది. కానీ, ఇలాంటి చర్యలతో నెట్టింట హైలైట్ కావడమే తప్ప.. గెలిచేది లేదని భారత అభిమానులు ఎద్దేవా చేశారు. వైభవ్ వంటి కుర్రాడిని పాక్ జట్టు ఎప్పటికీ తయారు చేసుకోలేదని.. టీమ్ఇండియా అసలైన బలం ఇదేనని పలువురు వ్యాఖ్యానించారు. ఇంతకుముందు పాక్ మాజీ ఆటగాడు వసీమ్ అక్రమ్ కూడా ఇదే విషయంపై తమ మేనేజ్‌మెంట్‌ను ఉద్దేశించి విమర్శలు చేసినట్లు గుర్తు చేస్తున్నారు.




## ధోని మాటలు
# స్ఫూర్తి నింపాయి: షై హోప్

భారత్‌తో మూడు వన్డేల సిరీస్‌ను 21 తేడాతో విండీస్ కోల్పోయింది. అయితే, చివరిమ్యాచ్‌లో విండీస్ ఆ సారథి షై హోప్ అజేయ సెంచరీతో గెలిపించాడు. హోప్ 143 బంతుల్లో 17 ఫోర్లు, 3 సిక్స్‌ల సాయంతో 162 పరుగులు చేశాడు. అతడికే ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు వరించింది. ఈ సందర్భంగా తనకు టీమ్ఇండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని మాటలు స్ఫూర్తిగా నిలిచాయని గుర్తు చేసుకున్నాడు. "ఎంఎస్ ధోని అద్భుతమైన వ్యక్తి. అతడితో నేను గతంలో మాట్లాడా. ఆ సందర్భంగా చెప్పిన మాటలు నాకు ఇప్పటికీ గుర్తున్నాయి. ఏదైనా లక్ష్యసాధనలో మనం అనుకున్న దానికంటే ఎప్పుడూ ఎక్కువ సమయం ఉంటుందని అన్నారు. ఈ మ్యాచ్‌లో కేవలం తుది ఫలితంపైనే ఎక్కువగా దృష్టి పెట్టకుండా చివరి వరకూ మ్యాచ్‌ను తీసుకెళ్లేందుకు ప్రయత్నించా. లక్ష్యం గురించి మరీ ఎక్కువగా ఆందోళన పడకుండా.. బౌండరీలను సాధించడం ఎలా అనేది ఫోకస్ చేశా'' అని హోప్ తెలిపాడు.



**దానిపై అవగాహన ఉంది**

"భారత జట్టు అప్పటికే కొన్ని ఓవర్లు వెనకబడి ఉందని నాకు తెలుసు. ఆఖర్లో ఎక్కువ మంది ఫీల్డర్లు బయట ఉండరని తెలుసు. సర్కిల్‌లో ఐదుగురు ఉండాలి. ఇలాంటి స్కోరును డిఫెండ్ చేయడం కష్టమని తెలుసు. వాటన్నింటిని పరిగణనలోకి తీసుకొని బ్యాటింగ్ చేశా. అదృష్టవశాత్తూ మాకు మంచే జరిగింది.'' అని వెల్లడించాడు.

# సూపర్ ఫామ్‌లో ఆ ముగ్గురు.. ప్రయోగాలకు సమయం లేదు: శుభ్‌మన్ గిల్

వెస్టిండీస్‌తో మూడు వన్డేల సిరీస్ ముగిసింది. మళ్లీ న్యూజిలాండ్‌తో సిరీస్ వరకూ టీమ్ఇండియా స్టార్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆటను చూసేది లేదు. అయితే, విండీస్‌పై ఇద్దరూ శతకాలు సాధించి తమ ఫామ్‌పై ఉన్న అపోహలను తొలగించారు. ఇక కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అయితే డబుల్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఆఖరి వన్డేలో కేఎల్ రాహుల్ కూడా శతకం చేసి ఆ లోటును పూరించాడు. వన్డే ప్రపంచ కప్‌లో సీనియర్ల పాత్ర ఎంత కీలకంగా మారుతుందో ఈ ప్రదర్శన బట్టే చెప్పేయొచ్చు. ఇదే మాటను కెప్టెన్ గిల్ కూడా స్పష్టం చేశాడు. "సీనియర్ల నుంచి అద్భుతమైన ఆట వచ్చింది. గత నాలుగు ఇన్నింగ్స్‌ల్లో రోహిత్ భాయ్ రెండు సెంచరీలు చేశాడు. మరోసారి 90+ పరుగులు రాబట్టాడు. విరాట్ భాయ్ గురించి కూడా ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇప్పుడు కేఎల్ రాహుల్‌కు మంచి అవకాశం వచ్చింది. దానిని అతడు రెండు చేతులతో అందుకొన్నాడు. జట్టు కోసం ఎక్కడైనా వచ్చేందుకు సిద్ధమని చెప్పకనే చెప్పాడు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఆడతానని అతడి ఇన్నింగ్స్‌తో సమాధానం ఇచ్చాడు. వీరంతా ఫామ్‌లో ఉండటం భారత్‌కు పెద్ద సానుకూలాంశం'' అని గిల్ తెలిపాడు.

**ప్రయోగాలకు ఎక్కువ సమయం లేదు**

"వచ్చే ప్రపంచ కప్ నాటికి మేం మరీ ఎక్కువ మ్యాచులు ఆడలేం. ప్రయోగాలు చేయడానికి సరిపడినంత సమయం లేదనుకుంటా. ఇప్పుడు అందుబాటులో ఉన్న ప్రతి ఒక్కరూ రాబోయే వన్డే సిరీస్‌లోనూ ఆడతారు. వరల్డ్ కప్ బరిలోకి దిగే కాంబినేషన్‌పై కసరత్తు జరుగుతోంది. సీనియర్లకు




విశ్రాంతి ఇచ్చే అవకాశం లేదు. అలాంటి అవసరమూ లేదు'' అని గిల్ స్పష్టం చేశాడు. ఈ నెల మూడో వారం నుంచి న్యూజిలాండ్ పర్యటనకు టీమ్ఇండియా వెళ్లనుంది. అక్కడ ఐదు వన్డేలు, ఐదు టీ20లు, రెండు టెస్టులను ఆడనుంది.

# ఆసియా క్రీడల్లో భారత్-పాక్ మ్యాచ్‌లకే మోస్ట్ వ్యూస్: ఓసీఏ





భారత్‌పాకిస్థాన్ మధ్య జరిగిన పురుషుల క్రికెట్ ఫైనల్, హాకీ సెమీఫైనల్ మ్యాచ్‌లకు ఆసియా క్రీడల చరిత్రలోనే అత్యధిక వ్యూస్ వచ్చాయని 'ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియా' వెల్లడించింది. శనివారం జరిగిన పాకిస్థాన్‌భారత్ క్రికెట్ మ్యాచ్ అత్యధికంగా వీక్షణలు సాధించగా.. గురువారం నిర్వహించిన భారత్‌పాక్ హాకీ సెమీఫైనల్ మ్యాచ్ రికార్డు స్థాయి వ్యూస్ ను సాధించినట్లు ఓసీఏ కోఆర్డినేషన్ కమిటీ అధ్యక్షుడు తయ్యబ్ ఇక్రమ్ పేర్కొన్నారు. అయితే వీక్షకుల సంఖ్య, రెండింటిలో ఏ మ్యాచ్‌కు ఎక్కువ వీక్షణలు వచ్చాయనే గణాంకాలను వెల్లడించలేదు.

**భారీ కార్యక్రమాల్లో సవాళ్లు సహజమే..**

ఆసియా క్రీడల నేపథ్యంలో కొందరు క్రీడాకారులకు సరైన వసతి సౌకర్యాలు, నిర్వహణ ఏర్పాట్లు కల్పించలేదని పలువురు ఆరోపించిన విషయం తెలిసిందే. దీనిపై తయ్యబ్ ఇక్రమ్ మాట్లాడుతూ.. ఇటువంటి భారీ క్రీడా కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు పలు సవాళ్లు ఎదురవ్వడం సహజమన్నారు. 'వసతి సహా పలు విషయాలపై కొన్ని ఫిర్యాదులు వచ్చాయని, మరికొన్ని సమస్యలు కూడా వెలుగులోకి వచ్చాయని మాకు తెలుసు. వాస్తవానికి కొన్ని సవాళ్లు ఉన్నాయి. కానీ, మేము ఆ సవాళ్లను ఎదుర్కొన్న విధానమే మరింత ముఖ్యమైనది. మేము మా అథ్లెట్లకు ఉత్తమ వసతి ఏర్పాట్లు, లాజిస్టిక్స్, కమ్యూనికేషన్లను అందించడానికి ప్రయత్నించాము. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం మాకు కొత్తేమీ కాదు. ఒలింపిక్ గేమ్స్, ఆసియా గేమ్స్ సహా అనేక ఇతర ఖండాంతర క్రీడలను నిర్వహించాము. ప్రస్తుతం ఎదురైన సవాళ్లను దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తులో మరింత మెరుగైన ఏర్పాట్లు చేస్తాం' అని పేర్కొన్నారు.



## మైసాకు పోటీగా జేజమ్మ మలయాళం మూవీ

బాక్సాఫీస్ వద్ద నేషనల్ క్రష్ రష్మిక మందన్నతో అనుష్క పోటీ పడబోతుంది. ఈ టాలీవుడ్ హీరోయిన్లు నటించిన సినిమాలు ఒకే రోజు థియేటర్ల ద్వారా ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. ఇటీవల రిలీజ్ చేసిన మైసా టీజర్‌తో సినిమాపై అంచనాలు అమాంతం పెరిగాయి. ఈ మూవీ నవంబర్ 27న థియేటర్లలోకి రాబోతుంది. పాన్ ఇండియన్ లెవెల్‌లో తెలుగుతో పాటు మరో నాలుగు భాషల్లో ఈ సినిమా విడుదల చేయబోతున్నారు. మైసాకు పోటీగా అనుష్క మలయాళం డెబ్యూ మూవీ కథనార్ థియేటర్లలోకి రాబోతున్నట్లు సమాచారం. పీరియాడికల్ హారర్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ సినిమాను నవంబర్ 27న రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేసినట్లు తెలిసింది.

## పెద్ది డైరెక్టర్‌తో మెగాస్టార్ మూవీ



రామ్‌చరణ్ పెద్ది తర్వాత తన తదుపరి సినిమాను మెగా హీరోతోనే చేయబోతున్నారు డైరెక్టర్ బుచ్చిబాబు సానా. పెద్ది కమర్షియల్ ఫెయిల్యూర్‌గా నిలిచినా బుచ్చిబాబు సానా టేకింగ్‌కు ప్రశంసలు దక్కాయి. మెగాస్టార్ చిరంజీవితో బుచ్చిబాబు కాంబినేషన్‌లో ఓ పాన్ ఇండియన్ మూవీ కన్ఫామ్ అయినట్లు చెబుతోన్నారు. పెద్ది సినిమా విషయంలో డైరెక్టర్ పనితీరుకు ఇంప్రెస్ అయిన చిరంజీవి ఓ కథ రెడీ చేసుకోమని చెప్పినట్లు సమాచారం. చిరంజీవి ఇమేజ్‌కు తగ్గట్లుగా రా అండర్ రస్టిక్ పాయింట్‌తో స్టోరీ రాసుకున్న బుచ్చిబాబు...ఇటీవలే మెగాస్టార్‌ను కలిసి వినిపించినట్లు సమాచారం. చిరంజీవికి కూడా కథతో పాటు అందులోని ఎమోషన్స్ బాగా నచ్చినట్లు చెబుతున్నారు. ఫుల్ బౌండ్ స్క్రిప్ట్‌ను సిద్ధం చేసుకోమని చెప్పినట్లు టాక్ వినిపిస్తోంది.



## అనుపమ డబుల్ ట్రీట్

తెలుగు ఆడియెన్స్‌కు అనుపమ పరమేశ్వరన్ డబుల్ ట్రీట్ ఇవ్వబోతుంది. ఆమె హీరోయిన్‌గా నటించిన రెండు సినిమాలు రెండు వారాల గ్యాప్‌లో థియేటర్లలోకి రాబోతున్నాయి. ఈ రెండు సినిమాలు తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లోనే రూపొందడం గమనార్హం. శర్వానంద్, అనుపమ పరమేశ్వరన్ హీరోహీరోయిన్లుగా నటించిన భోగి టీజర్‌ను ఆదివారం రిలీజ్ చేశారు. ఇంటెన్స్ యాక్షన్ అంశాలతో ఈ టీజర్ ఆసక్తికరంగా సాగింది. ఈ టీజర్‌లో పల్లెటూరి అమ్మాయిగా డీ గ్లామర్ పాత్రలతో అనుపమ పరమేశ్వరన్ కనిపించింది. శర్వానంద్, అనుపమ లుక్స్, వారిద్దరి ట్రాన్స్‌ఫర్మేషన్, మేకోవర్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. నవంబర్ 12న ఈ యాక్షన్ మూవీ థియేటర్లలోకి రానున్నట్లు ప్రకటించారు.

## మమితా బైజుకు జాక్‌పాట్

మమితా బైజు నటించిన విశ్వనాథ్ అండ్ సన్స్, బెత్లెహం కుడుంబ యూనిట్ బాక్సాఫీస్ రికార్డులను తిరగరాశాయి. ఈ విజయాలతో అమ్మడి అదృష్టం మారిపోయింది. తాజాగా వెంకీ అట్లూరి సినిమాలో నాని సరసన హీరోయిన్‌గా మమితాబైజు కనిపించబోతున్నట్లు తెలిసింది. ఈ సినిమా కోసం అమ్మడికి భారీ రెమ్యూనరేషన్ ఆఫర్ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఒక్కో సినిమాకు రెండు నుంచి మూడు కోట్ల మధ్య పారితోషికం తీసుకుంటోంది మమితాబైజు. నాని సినిమా కోసం ఆరు కోట్ల పారితోషికం డిమాండ్ చేసినట్లు చెబుతున్నారు.





## ఫర్జీ 2 నుంచి రాశీఖన్నా ఔట్

దర్శకద్వయం రాజ్‌డీకే రూపొందించిన ఫర్జీ వెబ్‌సిరీస్ బాలీవుడ్‌లో విమర్శకుల ప్రశంసలను అందుకుంది. ఇందులో షాహిద్‌కపూర్, విజయ్ సేతుపతి, రాశీఖన్నాతో పాటు పలువురు స్టార్స్ కీలక పాత్రల్లో నటించారు. ఈ క్రైమ్ థ్రిల్లర్ వెబ్ సిరీస్‌కు కొనసాగింపుగా సీజన్ 2 రాబోతుంది. ఫర్జీ 2 నుంచి రాశీఖన్నా తప్పుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. సీజన్ వన్‌లో మేఘా వ్యాస్ అనే ఆర్‌బీఐ ఆఫీసర్ పాత్రలో రాశీఖన్నా కనిపించింది. పాజిటివ్‌గా కనిపించే నెగెటివ్ క్యారెక్టర్‌లో డిఫరెంట్ వేరియేషన్స్‌తో కూడిన నటనతో ప్రేక్షకులను మెప్పించింది. ఫర్జీకి వచ్చిన రెస్పాన్స్‌తో సెకండ్ సీజన్‌లో కూడా రాశీఖన్నా పాత్రను కంటిన్యూ చేయాలని దర్శకద్వయం ప్లాన్ చేశారు. కానీ రజనీకాంత్ ధర్మన్‌తో పాటు మరికొన్ని సినిమాలతో బిజీగా ఉన్న రాశీఖన్నా ఈ వెబ్‌సిరీస్ నుంచి తప్పుకున్నట్లు సమాచారం.

## డైరెక్ట్ గా ఓటీటీలోకి లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్

టాలీవుడ్ కమెడియన్ హర్ష చెముడు ప్రధాన పాత్రలో నటించిన 'లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' నేరుగా ఓటీటీలో రిలీజ్ కాబోతుంది. ఈ మూవీ అక్టోబర్ 9 నుంచి ఈటీవీ విన్ ఓటీటీలో స్ట్రీమింగ్ కాబోతుంది. రొమాంటిక్ కామెడీగా రూపొందిన ఈ మూవీలో జీవన్ కుమార్, హైపర్ ఆది, ఐశ్వర్య హోలక్కల్, రూప శ్రావ్య కీలక పాత్రల్లో నటించారు. దీని ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు.

